


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 297, పేజీలు - 08

బుధవారం, ఏప్రిల్ 15, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## మహిళా రిజర్వేషన్ల ముసుగులో

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం



**- కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రొరేటా ప్రకారం నియోజకవర్గాల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్ల సంఖ్య తగ్గి ఆ వర్గాలు నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమ లక్ష్యం రాజ్యాధికారం సాధించడమే అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలకు విఘాతం కలుగుతున్న సందర్భంలో దళితులు, మేధావులు ఈ విషయంపై ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు.పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించి సమాజంలో సమాన విలువ, గౌరవం కల్పించిన నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ముడిపెట్టి కలగాపులగం చేయాలని ప్రయత్నిస్తున్నారని కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌పై మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపు అని మొదట ప్రస్తావించారని ఇప్పుడు అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తే దామాషా ప్రకారం 50 శాతం పెంచుతామని చెబుతున్నారని అన్నారు.ఆ ప్రాతిపదిక ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాలను పెంచుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దక్షిణాదిలో సీట్లు తగ్గడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వుడు సీట్లు తగ్గుతాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏ లెక్కన దక్షిణాది కోటాను తగ్గిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల పెంపుపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పిన మాటపై నిలబడే ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేసి చూపించిన రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటేనని తెలిపారు. కులగణన చేస్తామని చెప్పామని అలా చేసి చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు.మంచి పనికి తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

2లో..

## మోడీకి ట్రంప్ ఫోన్ కాల్

**- హార్మూజ్ పై కీలక చర్చలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికా-ఇరాన్ సంఘర్షణ ప్రభావం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకూ పాకుతోంది. ఈ యుద్ధానికి ముందు తెరిచి ఉన్న హార్మూజ్ జలసంధిని ఇరాన్ ఆ తర్వాత దిగ్బంధించడంతో దాన్ని విడిపిస్తానని పంతం పట్టిన అమెరికా పలు విఫలయత్నాలు చేసింది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ తో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈసారి తామే హార్మూజ్ జలసంధిని దిగ్బంధించాలని ట్రంప్ నిర్ణయించారు. ఈ ప్రభావం భారత్ పై పడుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీకి మంగళవారం ట్రంప్ కాల్ చేశారు.ఇరాన్ తో అమెరికా రెండు వారాల కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత మోడీ-ట్రంప్ మధ్య తొలి ఫోన్ కాల్ ఇదే. మంగళవారం ఇరువురు నేతలు దాదాపు 40 నిమిషాల పాటు ఫోన్ కాల్ లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ తో విఫలమైన

2లో..

## కాంగ్రెస్ వైఫల్యాలపై

# పోరాట కార్యాచరణ

**- మే, జూన్ నెలల్లో ప్రత్యక్ష పోరాటాలను ప్రారంభించనున్నట్టు కేటీఆర్ వెల్లడి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాబోయే పోరాటాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరుకానున్నారని కేటీఆర్ తెలిపారు. అనంతరం ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. మే, జూన్ నెలల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలపై తొలుత దృష్టి సారించబోతున్నట్లు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఏయే ప్రాంతాల్లో ఏయే హామీలు ఇచ్చారో, తిరిగి అదే ప్రాంతాల్లో సభలు పెట్టి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయాల కోసమే వాడుకుందని మండిపడ్డారు. అంబేద్కర్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా, ఆయనకు భారతరత్న ఇవ్వడంలోనూ, పార్లమెంటులో ఫొటో పెట్టడంలోనూ కాంగ్రెస్ నిర్లక్ష్యం వహించిందని

2లో..

## తెలుగు ప్రజలను బంట్రోతులుగా చూసిందే కాంగ్రెస్ పార్టీ

**- రేవంత్ రెడ్డి 'బంట్రోతు' వ్యాఖ్యలకు**
**కిషన్ రెడ్డి కౌంటర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఆయన మీడియాతో మాట్లాడుతూ,

2లో..

## లక్షలాది మందిని క్వాంటం

# నిపుణులుగా తీర్చి దిద్దుతాం

**- అమరావతిలో దేశపు తొలి క్వాంటం కంప్యూటర్ల ఆవిష్కరణ**

- టెక్నాలజీ వినియోగదారుల నుంచి ఉత్పత్తిదారుల స్థాయికి భారత్ ఎదుగుతోందన్న చంద్రబాబు
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంలో భాగంగా డీప్ టెక్నాలజీ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత
- క్వాంటం టెక్నాలజీ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని యువతకు, శాస్త్రవేత్తలకు పిలుపు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి గడ్డపై దేశ సాంకేతిక రంగ చరిత్రలో ఒక నూతన అధ్యాయం లిఖితమైంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'అమరావతి 1ఎస్', 'అమరావతి 1క్యూ' అనే రెండు క్వాంటం కంప్యూటర్ రిఫరెన్స్ వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవం, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వంటి చారిత్రక ప్రాధాన్యత ఉన్న రోజున ఈ ఘనత సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, భవిష్యత్ టెక్నాలజీలో భారతదేశాన్ని, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఎలాగో, భారతదేశానికి అమరావతి 'క్వాంటం వ్యాలీ'గా కీర్తి గడిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### దేశానికి అమరావతి క్వాంటం కానుక

"ఈ రోజు చాలా ప్రత్యేకమైనది. ఒకవైపు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి, మరోవైపు ప్రపంచ క్వాంటం దినోత్సవం. విజ్ఞానం ద్వారా

2లో..

# వైసీపీ ఫేక్ ఫ్యాక్టరీని తిప్పికొట్టాలి

**- టీడీపీ క్యాడర్‌కు నారా లోకేశ్ దిశానిర్దేశం**

- క్లస్టర్ ఇన్‌చార్జులతో నారా లోకేశ్ 'కాఫీ కబుర్లు'
- పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేడర్‌కు పిలుపు
- ఎన్టీఆర్, చంద్రబాబు ఆశయ సాధనే లక్ష్యంగా పనిచేయాలని సూచన



అమరావతి (ప్రశ్న న్యూస్) పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, సిద్ధాంతపరమైన పునాదులే నాయకత్వానికి అసలైన బలమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించి, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో భాగంగా నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో లోకేశ్ పాల్గొని వారికి దిశానిర్దేశం

2లో..

## లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన

# అంశంపై సీఎంలకు లేఖలు

**- ఈ విషయంలో మనమంతా ఏకమవుదామన్న రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక చర్యలు చేపట్టారు. జనాభా ప్రాతిపదికన ఈ ప్రక్రియ చేపడితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఐక్య పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌లకు ఆయన లేఖలు రాశారు. ఈ అంశంపై దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసికట్టుగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. లోక్‌సభ సీట్ల సర్దుబాటును దక్షిణాది రాష్ట్రాల రాజకీయ హక్కులపై జరుగుతున్న దాడిగా రేవంత్ రెడ్డి

2లో..

## నియోజకవర్గాల పునర్విభజన

**- 543 నుంచి 850కి పెరగనున్న లోక్ సభ స్థానాలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ప్రకారం, లోక్ సభ సీట్లు 543 నుంచి 850కు పెరిగే అవకాశం ఉంది. ఈ నెల 16న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను పార్లమెంటులో

2లో..

## పాదయాత్రకు వెళ్లే ముందు.. కవిత ప్రశ్నలకు సమాధానాలు చెప్పు

**- కేటీఆర్ పై మహేశ్ గౌడ్ ధ్వజం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై, ఆ పార్టీ అగ్రనేతలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందన ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు పదవులు కోల్పోయి విలవిలలాడుతున్నారని

2లో..

## తెలంగాణాలో ఠారెత్తిస్తున్న ఎండలు

**- ఉదయం 9 నుంచి భానుడి భగభగ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్,

2లో..

# నన్ను నమ్మండి.. ఇవి మోసపూరితమైనవి కావు

**- తమిళనాడు ఓటర్లపై విజయ్ హామీల వర్షం**



చెన్నై (ప్రశ్న న్యూస్) మిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ తన ఎన్నికల ప్రచారంలో హామీల వర్షం కురిపించారు. తమిళనాడు రాజకీయాల్లో కీలకమైన కొంగు ప్రాంతంలోని టెక్స్‌టైల్ హబ్‌గా పేరుగాంచిన తిరుప్పూర్‌లో మంగళవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు, రైతులు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ), ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. తమ పార్టీ పూర్తిస్థాయి ఎన్నికల మేనిఫెస్టోను ఏప్రిల్ 16న పుస్తక రూపంలో విడుదల చేస్తామని వెల్లడించారు. అయితే, అంతకంటే ముందే ప్రజల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో కొన్ని "ప్రాధాన్యత హామీలను" ఆయన ప్రజల ముందుంచారు. ముఖ్యంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చేనేత రంగానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చిన విజయ్,

2లో..

# లక్షలాది మందిని క్వాంటం నిపుణులుగా తీర్చి దిద్దుతాం

సాధికారత సాధ్యమని అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తూ, రాజ్యాంగం నుంచి క్వాంటం వరకు భారత్ ప్రగతి సాధిస్తోందనడానికి ఇదే నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు. అమరావతి 1లా ను ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో, అమరావతి 1రు ను మేధా టవర్స్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇవి కేవలం కంప్యూటర్లు కావని, క్వాంటం హార్డ్‌వేర్‌ను వాస్తవ పరిస్థితుల్లో పరీక్షించడానికి, ధ్రువీకరించడానికి వీలు కల్పించే పూర్తిస్థాయి టెస్ట్‌బెడ్‌లు అని వివరించారు. ఇప్పటివరకు పరిమితంగా ఉన్న క్వాంటం హార్డ్‌వేర్ యాక్సెస్, ఈ సౌకర్యాలతో పరిశోధకులు, స్టార్టప్‌లకు అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. "పార్లమెంటు అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తించి మాపై నమ్మకం ఉంచింది. ఈ రోజు, ఈ రాజధాని నుంచే దేశానికి ఈ క్వాంటం సౌకర్యాలను కానుకగా అందిస్తున్నందుకు గర్వంగా ఉంది," అని చంద్రబాబు పేర్కొన్నారు.

### సిలికాన్ వ్యాలీ నుంచి క్వాంటం వ్యాలీకి

భవిష్యత్తు క్వాంటం కంప్యూటింగ్‌దేనని నొక్కిచెప్పిన చంద్రబాబు, ఈ సాంకేతికతను అభివృద్ధి చేసే దేశాలే ప్రపంచాన్ని శాసిస్తాయని అన్నారు. "నిన్నటి వరకు టెక్నాలజీ ఆవిష్కరణల కోసం అందరూ సిలికాన్ వ్యాలీ వైపు చూసేవారు. కానీ నేటి నుంచి, ఎవరైనా తమ ఆవిష్కరణలను ప్రారంభించాలన్నా, పరీక్షించాలన్నా అమరావతిలోని క్వాంటం వ్యాలీకి రావాలి. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉంటే, భారతదేశానికి అమరావతిలో క్వాంటం వ్యాలీ ఉంటుంది" అని ఆయన ఉద్ఘాటించారు. అమరావతి కేవలం ఒక నగరం కాదని, ఇంద్రుడి నివాసమైన అమరావతి పేరుతో అత్యుత్తమ భవిష్యత్ నగరంగా దీనిని నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. కాలుష్యరహిత, హరిత ఇంధన ఆధారిత, అత్యుత్తమ జీవన ప్రమాణాలున్న నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటుందని తెలిపారు.

### 'ఆత్మనిర్భర్' భారత్ దిశగా కీలక ముందడుగు

ఈ క్వాంటం వ్యవస్థల రూపకల్పన పూర్తిగా దేశీయ సరఫరా గొలుసుతో జరగడం ఒక చారిత్రక మైలురాయి అని చంద్రబాబు అభివర్ణించారు. ఇది కేవలం శాస్త్రీయ విజయం మాత్రమే కాదని, జాతీయ సామర్థ్యానికి ప్రతీక అని అన్నారు. "మనం ఆధారపడటం నుంచి ఆత్మనిర్భర సామర్థ్యం వైపు, భాగస్వామ్యం నుంచి నాయకత్వం వైపు పయనిస్తున్నాం," అని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో టీఐఎఫ్ఆర్ ముంబై, ఐఐఎస్‌సీ బెంగళూరు, డీఆర్‌డీఓ, అంబర్ ఎంటర్‌ప్రైజెస్, క్యూబిట్ ఫోర్స్ వంటి అనేక జాతీయ సంస్థల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. ఢిల్లీ నుంచి ముంబై, బెంగళూరు నుంచి అమరావతి వరకు వివిధ సంస్థలు ఒకే లక్ష్యంతో పనిచేసి దీనిని సాకారం చేశాయని కొనియాడారు.

### ప్రధాని మోదీ దార్శనికత.. టెలికం స్ఫూర్తి

టెక్నాలజీని అర్థం చేసుకుని, ప్రోత్సహించే నాయకుడు సరైన సమయంలో ఉండటం దేశ అదృష్టమని, ప్రధాని నరేంద్ర మోదీ ఆ కోవకు చెందిన వారని చంద్రబాబు ప్రశంసించారు. "నా రాజకీయ జీవితంలో టెక్నాలజీని ఇంతలా అర్థం చేసుకున్న నాయకుడిని చూడలేదు. క్వాంటం మిషన్, సెమీకండక్టర్ మిషన్ వంటివి ఆయన దార్శనికత వల్లే సాధ్యమయ్యాయి" అని అన్నారు. గతంలో వాజ్‌పేయి హయాంలో టెలికం రంగంలో తీసుకువచ్చిన సంస్కరణల వల్ల దేశంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, అదే స్ఫూర్తితో నేడు మోదీ నాయకత్వంలో బీఎస్ఎన్ఎల్, టాటా, తేజస్, ఐఐటీ మద్రాస్ కలిసి స్వదేశీ 4జీ టెక్నాలజీని అభివృద్ధి చేశాయని గుర్తుచేశారు.

### ఏపీలో డీప్ టెక్నాలజీ పర్యావరణ వ్యవస్థ

క్వాంటం వ్యాలీతో పాటు రాష్ట్రంలో విస్తృతమైన డీప్ టెక్నాలజీ పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. "వికసిత్ భారత్ 2047కు ప్రధాని పిలుపునిస్తే, మేము 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. అందులో డీప్ టెక్నాలజీ కీలకమైన అంశం" అని అన్నారు. తిరుపతిలో స్పేస్ సిటీ, విశాఖపట్నంలో మెడ్‌టెక్ సిటీ, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీ, రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు, కోపర్తి, అనంతపురంలో సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో త్వరలో ప్రారంభం కానున్న గూగుల్ ఏఐ, క్లౌడ్ క్యాంపస్ రాష్ట్ర డిజిటల్ ఆశయాలకు నిదర్శనమని పేర్కొన్నారు.

### యువత, పరిశోధకులకు ముఖ్యమంత్రి పిలుపు

ఈ సాంకేతిక విప్లవంలో యువత కీలక పాత్ర పోషించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు క్వాంటం కోర్సులపై ఆసక్తి చూపడం శుభపరిణామమని అన్నారు. "ఐబీఎం, వైజర్, ఐఐటీ చెన్నై సహకారంతో రాష్ట్రంలోని 4.5 లక్షల మంది యువతకు క్వాంటం, ఏఐ, డీప్ టెక్నాలజీస్‌లో నైపుణ్య శిక్షణ ఇవ్వడమే మా లక్ష్యం" అని ప్రకటించారు. కేవలం 6 నెలల్లోనే శాస్త్రవేత్తలు ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌ను సిద్ధం చేశారని అభినందించారు. "ఇది ఆరంభం మాత్రమే. దీనిని మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలి. వేగవంతం చేయాలి. త్వరలో రాష్ట్రానికి రానున్న ఐబీఎం క్వాంటం కంప్యూటర్ కంటే ముందే, అమరావతిలో తయారైన కంప్యూటర్‌ను సిద్ధం చేయాలి" అని శాస్త్రవేత్తలకు ఆయన సవాలు విసిరారు.

### విజ్ఞానం నుంచి క్వాంటం వరకు.. చారిత్రక రోజు

క్వాంటం టెక్నాలజీ ఔషధాల ఆవిష్కరణ, వాతావరణ అంచనాలు, సురక్షితమైన కమ్యూనికేషన్లు, ఆర్థిక భద్రత, రక్షణ రంగం వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని చంద్రబాబు వివరించారు. దీనివల్ల శాస్త్రవేత్తలకే కాకుండా హార్డ్‌వేర్ ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, సాంకేతిక నిపుణులకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా హార్డ్‌వేర్, ఉత్పత్తుల రంగంలో భారత్ వెనుకబడిందని, కానీ ఐటీ రంగంలో మన సత్తా చాటామని గుర్తుచేశారు. ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ మనకు మరో సువర్ణావకాశాన్ని ఇచ్చిందని, దీనిని అందిపుచ్చుకుని టెక్నాలజీ వినియోగదారుల నుంచి ఉత్పత్తిదారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ మహా యజ్ఞానికి సహకరించిన ప్రతి శాస్త్రవేత్తకు, సంస్థకు, స్టార్టప్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా రిజర్వేషన్ల ముసుగులో
# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన మాటలు ఆచరణలోకి రావాలంటే తమ సీట్లను సాధించుకోవాలని చెప్పారు. అప్పుడే మన హక్కుల కోసం మాట్లాడగలమని ఈ విషయంలో మేధావులు ఆలోచన చేయాలని కోరారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలకు సమాన అవకాశాలు కల్పించవచ్చని మార్గదర్శకం చేసిన మహానాయకుడు అంబేద్కర్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ఒక్కటే అన్ని సమస్యల నుంచి మనల్ని విముక్తి చేస్తుందని, జీవితాల్లో వెలుగులు నింపుతుందని, సమాజంలో సరైన గౌరవం దక్కుతుందని బలంగా విశ్వసించారని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆలోచనే తెలంగాణలో తమ ప్రజాపాలన విధానమని పేర్కొన్నారు. రక్తం చిందించకుండా శాంతితో యుద్ధాన్ని గెలవొచ్చని మహాత్మగాంధీ గారు ప్రపంచ దేశాలకు చాటిచెబితే ఆ దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా పరిపాలించవచ్చని నిరూపించిన వారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. ఈ దేశానికి మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారని చెప్పారు. భారత రాజ్యాంగంలో అంబేద్కర్ గారు జోడించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలే ముందు భాగంలో నిలిచి పోరాటం చేశారని తెలిపారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన గద్దరన్న, మారుమూల పల్లెల్లో జయ జయహే తెలంగాణను మారుమోగించిన అందెశ్రీను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. దళిత, గిరిజన సామాజిక వర్గానికి మంత్రిపదవులు, ఇతర పదవులు, అధికారులకు ప్రాధాన్యత విషయాల్లో గత ప్రభుత్వాలకు, ప్రజాప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను పోల్చుకోవాలని ప్రజలను కోరారు. ప్రజా ప్రభుత్వంలోనే అత్యధిక ప్రాధాన్యత దక్కిందని అనేక ఉదాహరణలు చెప్పారు. కులాల మధ్యన విభజన జరుగుతుందని, సమాజంలో మరింతగా అంతరాలు పెరుగుతున్నాయని ఆలోచన చేసి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశానికి భవిష్యత్తును అందించే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పేదలకు నాణ్యమైన విద్య అందడం లేదని, నాణ్యమైన విద్యను అందించడానికి అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లలో అత్యధికంగా దళితులకు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 67 వేల ప్రభుత్వ ఉద్యోగాలు నియమిస్తే అందులో 87 శాతం ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఉద్యోగాలొచ్చాయని తెలిపారు. ఒకవైపు అప్పులు, తప్పులను సవరిస్తూనే రాష్ట్రంలో పరిపాలనను చక్కబెడుతూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న మంచి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని తెలిపారు.

# మోడీకి ట్రంప్ ఫోన్ కాల్

అమెరికా-ఇరాన్ చర్చలు, హోర్ముజ్ జలసంధి దిగ్బంధం సహా పలు అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధిని గతంలో దిగ్బంధించిన ఇరాన్ భారత్ కు మాత్రం వెసులుబాటు కల్పించింది. ఇప్పుడు అమెరికా కూడా అలాంటి వెసులుబాటు ఇవ్వాలని ప్రధాని మోడీ ట్రంప్ ను కోరినట్లు సమాచారం. అయితే దీనిపై ట్రంప్ ఏం హామీ ఇచ్చారో తెలియలేదు. ఈ ఫోన్ కాల్ సందర్భంగా ఇద్దరు నాయకులు మధ్యప్రాచ్య పరిస్థితి, వాణిజ్యంపై చర్చించారని భారత్ లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. మధ్యప్రాచ్యంలో జరుగుతున్న పరిణామాలతో పాటు, వాషింగ్టన్‌లో అమెరికా-భారత్ మధ్య జరుగుతున్న కొన్ని కీలక అంశాల గురించి కూడా తమ అధ్యక్షుడు ప్రధాని మోడీతో చర్చించారని గోర్ పేర్కొన్నారు. మరోవైపు భారత ప్రజలు మిమ్మల్ని ప్రేమిస్తున్నారని ప్రధాని మోదీ ఆ ఫోన్ కాల్ సందర్భంగా ట్రంప్‌తో అన్నారు. అనంతరం ప్రధాని మోడీ ఫోన్ కాల్ పై ట్వీట్ చేశారు. "నా మిత్రుడు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుండి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాలలో మన ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయమైన పురోగతిని సమీక్షించుకున్నాము. అన్ని రంగాలలో మన సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము. మేము పశ్చిమ ఆసియాలోని పరిస్థితి గురించి కూడా చర్చించాము, హోర్ముజ్ జలసంధిని తెరిచి, సురక్షితంగా ఉంచడం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పాము' అని మోడీ తెలిపారు.

# నియోజకవర్గాల పునర్విభజన

ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారం ఇచ్చింది. బిల్లులకు సంబంధించిన ప్రతులను పంపించింది. పునర్విభజన బిల్లు ప్రకారం రాష్ట్రాల్లో 815 వరకు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశముంది. దీనితో లోక్ సభ స్థానాలు 543 నుంచి 850కి చేరవచ్చని అంచనా ఉంది. లోక్ సభలో బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసి సీట్ల పెంపు కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేసి 2029 ఎన్నికల్లో అమలు చేయాలని భావిస్తోంది. సీట్ల పెంపు తర్వాత దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయి. జనగణన తర్వాత వచ్చిన లెక్కల ఆధారంగా రిజర్వేషన్ ఉంటుంది. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్ సభ, అసెంబ్లీ సీట్లను 50 శాతం పెంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## ఇల్లంతకుంట ఉప మండల
## హిందూ సమ్మేళన వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**రాజన్న సిరిసిల్ల** ఇల్లంతకుంట మండల కేంద్రంలోని స్థానిక వాణినికేతన్ హైస్కూల్లో ఆవరణలో ఇల్లంతకుంట ఉప మండల హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు తూముకుంట మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన గోడపత్రిక , కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తూముకుంట మోహన్ రెడ్డి మాట్లాడుతూ అసంఘటితంగా ఉన్న హిందూ సమాజాన్ని ఏకత్రాటిపై సంఘటిత పరచాలని ఉద్దేశంతోనే హిందూ సమ్మేళన బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 21 తేదీ న మంగళ వారం రోజున సాయంత్రం 5 గంటలకు గంగాధర క్షేత్రం ప్రక్కన ఉన్న స్థలం లో సమ్మేళనం జరుగుతుందని తెలియజేశారు. ఈ సమ్మేళనానికి హిందూ బంధువులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఖండ జాగరణ సమితి సభ్యులు బత్తిని ఆంజనేయులు, కాసుపాక కిషన్, ఎగుర్ల శ్రీనివాస్, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ప్రధాన కార్యదర్శి ఈదుల రవీందర్ రెడ్డి, కోశాధికారి నార్ల రామ్ కిషన్, అనంతారం గ్రామ సర్పంచ్ వోల్లాల రజిత వెంకటేశం,హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు డాక్టర్ జగన్ మోహన్ రావు , వీరారెడ్డి , బొల్లం ధనుంజయ్ , మాజీ సర్పంచ్ కునబోయిన బాలరాజు, పర్స అయిలయ్య, అక్కెం నాగరాజు,బత్తిని స్వామి,పండుగ వెంకటి,అన్నాడి నవీన్ రెడ్డి,సార శశికాంత్,సింగరి శ్రీనివాస్,నారెడ్డి కిషోర్,నార్ల దినేష్,మొగిల్లా బాబు,కుమ్మరివేణి సత్యనారాయణ, సింగరి, శ్రీనివాస్, తిప్పారపు రామకృష్ణ, శిరవేణి అంజి, సార రాజు, కోమిటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సార శంకర్, సిరవేణి నర్సయ్య, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి . తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఒక అరుదైన మాణిక్యం

**- టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ.**

**శిరివెళ్ల** మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి మరియు నీటి సంఘం వైస్ చైర్మన్ చింతకుంట్ల బూసిరెడ్డి ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కల్లూరి శకుంతలమ్మ మాట్లాడుతూ భారతరత్న నవభారత రాజ్యాంగ నిర్మాత అపర మేధావి భారత దేశ తొలి న్యాయశాఖ మంత్రివర్యులు బాబాసాహెబ్ అంబేద్కర్ యొక్క స్ఫూర్తి చైతన్యం క్రమశిక్షణ యువత అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# పాదయాత్రకు వెళ్లే ముందు..
## కవిత ప్రశ్నలకు సమాధానాలు చెప్పు

విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేస్తాననడంపై స్పందిస్తూ ఆయన ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను క్షమించే పరిస్థితి లేదని అన్నారు. పదేళ్లలో చేసిన అరాచకాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. కేటీఆర్ పాదయాత్రకు వెళ్లే ముందు, తన చెల్లెలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. సంతోష్ రావు సంతోషం వెనుక ఉన్న రహస్యం ఏంటి? హరీశ్ రావు ఆనందం వెనుక ఉన్న దోపిడీ ఎంత? అనే విషయాలు కవిత ద్వారానే బయటపడుతున్నాయని సెటైర్లు వేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అడుగుతున్న ఆర్థిక లెక్కలకు సమాధానం చెప్పలేక కేసీఆర్ అండ్ కో సతమతమవుతున్నారని అన్నారు. పదేళ్లపాటు అధికార ముసుగులో అడ్డగోలుగా దోపిడీ చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రజల ఆదరణ కోల్పోయి పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

# తెలంగాణాలో ఠారెత్తిస్తున్న ఎండలు

మహబూబ్ నగర్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్, నిర్మల్, కరీంనగర్, వనపర్తి, కొమురంభీమ్ తదితర జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో బుధవారం వడగాలులు వీచే అవకాశం ఉంది. నేడు, రేపు ఉత్తర, దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఎండ తీవ్రత 41 నుంచి 44 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, నేడు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నుంచి ఎండల తీవ్రత మరింత ఎక్కువ కానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సీఎంలకు లేఖలు

అభివర్ణించారు. "దక్షిణాదిపై జరుగుతున్న ఈ దాడిని ఎదుర్కోవడానికి మనమంతా ఏకం కావాలి. ఢిల్లీలో మన గొంతుకను కాపాడుకోవాలి" అని తన లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలకు బహుమతికి బదులుగా శిక్షపడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిథ్యం తగ్గి, రాజకీయంగా ప్రాబల్యం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ప్రమాదాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందరికంటే ముందుగానే గుర్తించారని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. గత సంవత్సరం మార్చిలోనే చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల నేతలతో సమావేశం నిర్వహించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ స్ఫూర్తితో అందరూ కలిసి ముందుకు సాగాలని కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన సిద్ధాంతాలను గుర్తుచేస్తూ "చైతన్యవంతులను చేయండి, ఆందోళన చేయండి, సంఘటితం కండి" అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. "దక్షిణ భారతదేశానికి అత్యంత కీలకమైన ఈ విషయంలో మనమంతా ఏకం కావాలని ఈ లేఖ రాస్తున్నాను. రాజకీయ హక్కులపై జరుగుతున్న ఈ దాడిని మనం ఎదిరించి, ఢిల్లీలో మన గొంతుకను కాపాడుకోవాలి" అంటూ లేఖలో పేర్కొన్నారు. ఈ తీవ్రమైన సమస్యపై అందరూ కలిసి ముందుకు సాగాలని, ఐక్యంగా కవాతు చేద్దామని రేవంత్ తన లేఖను ముగించారు.

# నన్ను నమ్మండి.. ఇవి మోసపూరితమైనవి కావు

ఈ రంగానికి పలు కీలక హామీలు ప్రకటించారు. చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో నేరుగా విక్రయించుకునేందుకు ప్రత్యేకంగా ఒక ఈ-కామర్స్ బ్రాండ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేనేత మగ్గాలు లేదా పవర్‌లూమ్‌లు ఉన్న ప్రతి కుటుంబానికి, పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, విద్యుత్ సవాళ్లను అధిగమించేందుకు ఏటా రూ. 30,000 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత యూనిట్లకు 500 యూనిట్ల వరకు, పవర్‌లూమ్‌లకు 1,500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు నూలు, రంగులపై 50 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రకటించారు. ప్రతి చేనేత కార్మికుడికి రూ. 10 లక్షల జీవిత బీమా కవరేజీ కల్పిస్తామన్నారు. చేనేత కార్మికుల నెలవారీ పింఛనును రూ. 3,000కు పెంచుతామని హామీ ఇచ్చారు. చిన్న పరిశ్రమలపై విద్యుత్ టారిఫ్‌ల భారాన్ని కూడా తగ్గిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ఎంఎస్ఎంఈల కోసం పీక్-అవర్ విద్యుత్ ఛార్జీలను తాత్కాలికంగా నిలిపివేస్తామని, టెక్స్‌టైల్ రంగ పునరుద్ధరణకు మద్దతుగా ఐదేళ్లపాటు 100% విద్యుత్ పన్ను మినహాయింపు ఇస్తామని ప్రకటించారు.

వ్యవసాయ రంగంపై దృష్టి సారిస్తూ, ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు పూర్తిస్థాయిలో వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు. అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు 50 శాతం రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. వరి సేకరణ ధరను క్వింటాల్‌కు రూ. 3,500కు, చెరకు ధరను టన్నుకు రూ. 4,500కు పెంచుతామన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 10,000 ఆర్థిక సాయం అందిస్తామని కూడా వాగ్దానం చేశారు. పరిపాలనాపరమైన హామీలను కూడా విజయ్ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లకు పైగా సర్వీసులో ఉన్న తాత్కాలిక సిబ్బందిని పర్మినెంట్ చేస్తామన్నారు. పోలీసు శాఖలో ప్రమోషన్లలో అవినీతిని నిర్మూలించి, పారదర్శక బదిలీలు చేపడతామని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బందికి జీతాల పెంపు, సంక్షేమ ఆసుపత్రులు, మహిళా అధికారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. తన హామీలన్నీ నిజాయతీతో కూడినవని, మోసపూరితమైనవి కావని ప్రజలు తనను నమ్మాలని విజయ్ కోరారు. తమిళనాడు రాజకీయాల్లో ఒక "విజిల్ విప్లవం" తీసుకురావడానికి తనకు మద్దతివ్వాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ

ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించకుండా గేట్లు వేస్తే, తాము హెచ్చరించిన తర్వాతే గేట్లు తెరుచుకున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలు మోసపోయారని, వెయ్యికి పైగా గురుకులాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ అరాచక పాలనపై బీఆర్ఎస్ గట్టిగా నిలదీస్తుందని అన్నారు.

## తెలుగు ప్రజలను బంట్రోతులుగా చూసిందే కాంగ్రెస్ పార్టీ

పునర్విభజన జరిగితే ఇప్పుడు వచ్చిన కేంద్రమంత్రి పదవులు కూడా రాబోవని, బంట్రోతులుగా మారుతారని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలను బంట్రోతులుగా చూసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. అంజయ్య, ఇతర ముఖ్యమంత్రులను కాంగ్రెస్ పార్టీ ఎలా అవమానించిందో అందరికీ తెలుసని అన్నారు. జనాభా ప్రాతిపదికన పెంచితే దక్షిణాదికి నష్టమని ఇన్నాళ్లు అన్నారని, ప్రతి రాష్ట్రంలో కనీసం 50 శాతం సీట్లు పెంచుతుంటే కూడా రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాదికి బీజేపీ కీలక పదవులు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి చెప్పిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందించారు. ఉపరాష్ట్రపతి పదవులు చేపట్టిన వెంకయ్యనాయుడు, సీపీ రాధాకృష్ణన్ దక్షిణాదివాళ్లు కాదా అని ప్రశ్నించారు. ఎంపీ లక్ష్మణ్ ఉత్తరాదికి వలసపోతారని విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్ వదిలిపెట్టి కేరళకు రాలేదా అని నిలదీశారు. దక్షిణాది ముఖ్యమంత్రులు ఢిల్లీకి వెళితే రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి పంపించే డబ్బుతోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తోందని విమర్శించారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది నష్టపోతుందనే ఆలోచనతో మోదీ రాష్ట్రాలకు కనీసం 50 శాతం సీట్లు పెంపు ప్రతిపాదన తీసుకువచ్చారని తెలిపారు. కానీ గతంలో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు కేటాయించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. ఈసారి జనగణనతో పాటు కులగణన చేస్తున్నట్లు చెప్పారు. దీనికి సమయం తీసుకుంటుందని కిషన్ రెడ్డి అన్నారు.

# వైసీపీ ఫేక్ ఫ్యాక్టరీని తిప్పికొట్టాలి

చేశారు. తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఎన్టీఆర్, తెలుగువారి సత్తాను ప్రపంచానికి చాటిన చంద్రబాబు బలమైన సిద్ధాంతాలతోనే విజయాలు సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

### ఏ ఆత్మ చెప్పిందో గానీ.!

గత వైసీపీ పాలనలో జరిగిన దమనకాండను లోకేశ్ గుర్తుచేశారు. "దేవాలయంలాంటి టీడీపీ కార్యాలయంపై, చంద్రబాబు గారి ఇంటిపై దాడులు చేశారు. అమర్నాథ్ గౌడ్, అబ్దుల్ సలాం, తోట చంద్రయ్య వంటి వారిని వెంటాడి చంపారు. డాక్టర్ సుధాకర్, కోడెల శివప్రసాద్, చిన్నారి మిస్బా మరణానికి కారణమయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు విధ్వంసం, దాడులు, హత్యలు, అవినీతితో రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్, ఇప్పుడు అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వంపై విష ప్రచారానికి దిగుతున్నారు. వైసీపీ ఫేక్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే అసత్యాలను ఐక్యంగా తిప్పికొట్టాలి. నా రెడ్ బుక్ సమాజ హితం కోసమైతే, రాజారెడ్డి రాజ్యాంగంతో జగన్ సమాజాన్ని నాశనం చేయాలనుకున్నారు. ఏ ఆత్మ చెప్పిందో కానీ, 'మావిగన్' అంటూ కలవరిస్తున్నారు" అని లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు.

### ఆరు సిద్ధాంతాలను గ్రామస్థాయికి చేర్చాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు, వాటి వెనుక ఉన్న పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించడం అత్యంత కీలకమని లోకేశ్ స్పష్టం చేశారు. "కార్యకర్తల మధ్య ఐక్యత, క్రమశిక్షణ పార్టీని మరింత బలోపేతం చేస్తాయి. సిద్ధాంతాలపై ఆధారపడి ప్రజల్లో విశ్వాసం పెంచుకుంటేనే దీర్ఘకాలిక రాజకీయ విజయాలు సాధ్యమవుతాయి. ఎన్ని పనులున్నా ముఖ్యమంత్రి గారు, నేను ప్రతి వారం పార్టీ కార్యాలయంలో గడుపుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నాం. అదేవిధంగా ప్రతి కార్యకర్త కూడా పార్టీ కోసం కొంత సమయం కేటాయించాలి. పార్టీ రూపొందించిన ఆరు ముఖ్య సిద్ధాంతాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించాలి" అని ఆయన వివరించారు.

### కూటమి ధర్మాన్ని పాటిద్దాం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉండటం వల్లే అమరావతికి చట్టబద్ధత, విశాఖ ఉక్కు పరిరక్షణ, ప్రత్యేక నిధుల సాధన వంటివి సాధ్యమవుతున్నాయని లోకేశ్ తెలిపారు. నాయకులంతా పొత్తు ధర్మాన్ని పాటిస్తూ జనసేన, బీజేపీ నేతలతో కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. "కుటుంబంలో సభ్యుల మధ్య విభేదాలు వస్తే ఎలా కూర్చుని మాట్లాడుకుంటామో, అలాగే కూటమి నేతలు కూడా ఒక కుటుంబంలా భావించి ఏవైనా సమస్యలుంటే చర్చించుకుని పరిష్కరించుకోవాలి" అని ఆయన హితవు పలికారు. 'మై టీడీపీ' యాప్ ద్వారా కార్యకర్తలు తమ కార్యకలాపాలను నమోదు చేయాలని, ప్రతి ఒక్కరి పనితీరును అధినేత పర్యవేక్షిస్తున్నారని, కష్టపడిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు.

## గజ్వేల్లో ఘనంగా అంబేద్కర్ జయంతి జ్ఞానర్యాలీ



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబెద్కర్ జయంతిని పురస్కరించుకుని గజ్వేల్ పట్టణంలో అంబెడ్కర్ డెవలప్మెంట్ కమిటీ, అంబెడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో జ్ఞానర్యాలీ ఘనంగా నిర్వహించారు.స్థానిక కోటమైసమ్మ గుడి నుంచి అంబెడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ఈ ర్యాలీ జనసంద్రముగా సాగింది. భారీగా ప్రజలు, యువత, సంఘాల నాయకులు పాల్గొని అంబెడ్కర్ ఆలోచనలను ప్రాచుర్యం చేశారు.ఈ కార్యక్రమంలో అంబెడ్కర్ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు ఆటకూరి రాములు, కార్యదర్శి మాస్కూరి కిష్టయ్య, మన్నె కృష్ణ, పంబాల సత్యనారాయణ, మాచపురం బాలనర్సయ్య, బొల్లారం ఎల్లయ్య, మైసని మల్లయ్య, దమ్మని మల్లయ్య, పొట్ట యాదగిరి, మైస స్వామి, సంఘయోళ్ల నర్సింలు, చింతకింది బాలయ్య, పంబాల ఎల్లయ్య, మల్కగళ్ళ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.అలాగే జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షులు తుమ్మ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మైస రాములు, చిప్పల యాదగిరి, నీరుడి స్వామి, ఏలేశ్వరం మహేష్, మన్నె కృపానందం సహా వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరై అంబెడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. గజ్వేల్ మండలంలో 10వ తరగతిలో ప్రథమ ర్యాంకు సాధించిన జడ్పీహెచ్ఎస్ అహ్మదిపూర్కు చెందిన గోవర్ధన్ గిరికి రూ.5000, ద్వితీయ ర్యాంకు సాధించిన అఖిల (జెడ్పీహెచ్ఎస్ కొడకండ్ల)కు నగదు బహుమతి అందజేశారు. ఇంటర్మీడియట్లో ప్రథమ స్థానం పొందిన కె. మనోహర్కు రూ.5000, ద్వితీయ స్థానం సాధించిన కప్ప భావనకు రూ.3000 నగదు బహుమతులను గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు.అదేవిధంగా గజ్వేల్ మండలంలోని ఎస్సీ సర్పంచులను కమిటీ సభ్యులు శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమం సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలకంగా నిలిచింది.

## రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో హిందూ విరాట్ సమ్మేళనం



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని హేమాద్రి ఫంక్షన్ హాలులో విరాట్ హిందు సమ్మేళనాన్ని హిందూ నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్రామాల నుండి హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథి యజ్ఞం పవన్ కుమార్ శర్మ హిందూ సమ్మేళనం అధ్యక్షులు రాచర్ల రఘు రామ శర్మ ప్రధాన వక్త గాజుల రవీందర్, సర్పంచ్ లు హిందూ బంధువులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా యజ్ఞం పవన్ కుమార్ శర్మ పాల్గొని మాట్లాడుతూ హిందూ ధర్మం అంటే మతం కాదని జీవన విధానం అన్నారు. అలాగే భారత దేశం ప్రపంచనికి ఆదర్శం ప్రతి ఒక్కరు హిందూ సంస్కృతి సంప్రదాయలు కాపాడుకోవాలని అన్నారు.

## దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్ పట్టణ కేంద్రంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షుడు గడల ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ సంటి లత – నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తిరుపతి, అలాగే గణేష్,దేవిదాస్, కాంతయ్య, రత్నయ్య,ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుచుకుంటూ సమాజంలో సమానత్వం, న్యాయం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, యువజన నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమానత్వానికి అంబేద్కర్ మార్గమే సరైన దారి

- జాగిర్యాల్ గ్రామ సర్పంచ్ : గడల ప్రసాద్
- సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



భీంగల్ (ప్రశ్న న్యూస్)నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం, జాగిర్యాల్ గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, వీడీసీ సభ్యులు, వివిధ సంఘాల అధ్యక్షులు కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సర్పంచ్ గడల ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాలని, సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి అంబేద్కర్ ఆశయాలు దిశానిర్దేశం చేస్తాయని అన్నారు.ఇతర నాయకులు కూడా మాట్లాడుతూ అంబేద్కర్ సేవలను కొనియాడారు. గ్రామ ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భట్రాజు సంఘ ఎన్నికలపై కీర్తి సంతోష్ రాజ్ ఫైర్ నియమాల ఉల్లంఘనపై ఆగ్రహం

**సభ్యత్వ నమోదు లేకుండా జిల్లాల ఎన్నికలు ఎలా.?**

**బైలా నిబంధనలపై అనుమానాలు వ్యక్తం చేసిన నాయకులు**

**ఆధార్తో గుర్తింపు సరిపోతుందా.? పారదర్శకత ఎక్కడ.?**

**రాజకీయ ప్రభావం పెరిగిందా కుల సంఘాల్లో.?**

**రాష్ట్ర కమిటీ మౌనం ఎందుకు.?**



హైదరాబాద్ (ప్రశ్నన్యూస్) రాష్ట్ర భట్రాజు సంఘ ఎన్నికలు జిల్లాల వారీగా కొనసాగుతున్న నేపథ్యంలో, సభ్యత్వ నమోదు లేకుండానే ఎన్నికలను నిర్వహించడం పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సంఘం విధానాలపై సీనియర్ జర్నలిస్టు కీర్తి సంతోష్ రాజ్ కీలక ప్రశ్నలు లేవనెత్తారు.ఎన్నికల నిబంధనల ప్రకారం ముందుగా సభ్యత్వ నమోదు పూర్తి చేయాల్సి ఉండగా, ఆ ప్రక్రియ లేకుండానే ఎన్నికలు నిర్వహించడం ఎంతవరకు సముచితం అని ఆయన ప్రశ్నించారు. సభ్యత్వం నమోదు లేకపోతే ఎన్నికల్లో పాల్గొనేవారు నిజంగా సంఘానికి చెందిన వారేనా అనే సందేహం తలెత్తుతుందని పేర్కొన్నారు.ఎవరికి తోచినట్టు వారు ఎన్నికలు నిర్వహిస్తే, ఎన్నికల ప్రక్రియకు అర్థం ఏమిటి?" అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత అనుబంధాలు, వాడు నా వాడు -- వీడు నా వాడు' అనే ధోరణితో కమిటీలను ఏర్పాటు చేయడం వల్ల కుల సంఘాలు రాజకీయ వేదికలుగా మారుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు.హైదరాబాద్ వన్ పరిధిలో జరిగిన ఎన్నికల్లో జరిగిన తప్పిదాలు ఇతర జిల్లాల్లోనూ పునరావృతమవుతున్నాయని ఆయన ఆరోపించారు. ఆధార్ కార్డు ఆధారంగా సభ్యత్వాన్ని గుర్తిస్తున్నామని చెప్పడం సరైన విధానం కాదని, సరైన ధృవీకరణ లేకుండా కమిటీలను ప్రకటించడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. బైలా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎన్నికలు జరగాలని, ఆ విధంగా జరగని ఎన్నికలు చెల్లవని స్పష్టం చేశారు. కనీసం ఈ దశలో అయినా సభ్యత్వ నమోదు పూర్తి చేసి, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీని కోరారు.రాష్ట్ర స్థాయి నాయకత్వం సమస్యలపై స్పందించకపోవడం పట్ల కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంఘంలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను నెలకొల్పాలని ఆయన డిమాండ్ చేశారు.సభ్యత్వం లేకుండా ఎన్నికలు నిర్వహించడం కంటే, నియమ నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించడం ద్వారానే సంఘంపై విశ్వాసం నిలబడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## వెంకట్ రెడ్డి నగర్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్ కమిటీ ఎన్నిక

**ఎన్నికల నిర్వహించాలి కాలనీవాసుల డిమాండ్**

**సంతకాల సేకరణలో భారీగా కాలనీవాసుల భాగస్వామ్యం**

**ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను నిర్వహించాలి**

**సొంత ఇంటి సభ్యుడికి సభ్యత్వం ఇచ్చిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి**

**రాజకీయాలకతీతంగా కాలనీ ఎన్నికలు నిర్వహించాలి**




ఉప్పల్(ప్రశ్న న్యూస్) వెంకట్ రెడ్డి నగర్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించాలని వెంకట్ రెడ్డి నగర్ బస్టాండు ప్రాంగణంలో నల్ల పోచమ్మ దేవాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కాలనీవాసులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కోర్ కమిటీ సభ్యులను నియమించారు. జి. శంకరయ్య గౌడ్, బిల్లా కంటి యాదయ్య, బాణాల నారాయణ, బుచ్చిరెడ్డి, భూపాల్ రెడ్డి, కనకయ్య,వి. వెంకన్న, గడ్డం నరసింహ, పి, సోమయ్య గౌడ్, గజ్జల మల్లయ్య, సోమశేఖర్ గౌడ్, ఎన్ శ్రీనివాస్ చారి, పాల నరసింహ, సలీం, జి, యాదమ్మ ను కోర్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం అత్యవసరమని ఎన్నికల్లో నిలబడే వారు రాజకీయాలకి అతీతంగా నిలబడాలని వెంకట్ రెడ్డి నగర్ కాలనీ సభ్యులు ఎవరైనా పోటీ చేయవచ్చని విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణలో కాలనీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి నగర్ కాలనీవాసులు ఆకారపురం అరుణ్ పటేల్, యాకాంత్, టిల్లు, బిళ్ళ కంటి చిన్న, హరీష్ చారి, సలీం,రఘు, శంకర్, వినోద్, శివకుమార్ గౌడ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మల్లాపూర్ లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- అంబేద్కర్ ఆశయాల కోసం నిరంతరం పనిచేయాలి
- అంబేద్కర్ భారతదేశ ఒక రాజ్యాంగ నిర్మాత అని, ప్రపంచ మేధావి అని ప్రపంచ దేశాలు గుర్తించాయి
- ప్రపంచంలో భారతదేశ రాజ్యాంగం అత్యున్నతమైన రాజ్యాంగం
- అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్న రాజకీయ నాయకులు
- అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తప్పకుండా అమలు చేస్తే భారతదేశము ఎప్పుడో ప్రపంచంలో ముందంజలో ఉండేది



సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) ప్రపంచ మేధావి డా. బి.ఆర్. అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం,
మేడ్చల్ భారత రాజ్యాంగ శిల్పి, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు మేడ్చల్ ప్రాంతంలో ఘనంగా నిర్వహించామని మేడ్చల్ జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించామని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీందర్ సాగర్ మాట్లాడుతూ అంబేద్కర్ సేవలను గుర్తుచేశారు. "అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక యుగం. ఆయన రచించిన రాజ్యాంగం ప్రతి భారతీయునికి సమాన హక్కులు కల్పించింది. సామాజిక అసమానతలు తొలగించడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం" అని అన్నారు.అంబేద్కర్ కేవలం రాజ్యాంగ శిల్పి మాత్రమే కాదు, గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త, న్యాయవాది, రచయిత కూడా ఆయన రచనలు ఇప్పటికీ సామాజిక మార్పుకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. "అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్" వంటి రచనల ద్వారా కుల వ్యవస్థ పై తీవ్ర విమర్శలు చేసి సమాజాన్ని ఆలోచింపజేశారు.ఈ అంబేద్కర్ జయంతి వేడుకలు ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టే దిశగా ముందుకు సాగాలని ప్రతి ఒక్కరూ సంకల్పించారన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను యువత ఆచరించాలి

- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్
- నీలోజిపల్లిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయనిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించి దేశానికి దిశానిర్దేశం చేసిన గొప్ప దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు.అంబేద్కర్ ఆశయాల సాధనలో విద్య కీలకమని, ప్రతి కుటుంబం తమ పిల్లలకు మంచి విద్య అందించాలని, యువత సమాజ అభివృద్ధికి ముందుండాలని సూచించారు. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ అనే విలువలను జీవితంలో ఆచరించాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి స్వప్న,ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను యువత ఆచరించాలి

- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్
- నీలోజిపల్లిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయనిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించి దేశానికి దిశానిర్దేశం చేసిన గొప్ప దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు.అంబేద్కర్ ఆశయాల సాధనలో విద్య కీలకమని, ప్రతి కుటుంబం తమ పిల్లలకు మంచి విద్య అందించాలని, యువత సమాజ అభివృద్ధికి ముందుండాలని సూచించారు. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ అనే విలువలను జీవితంలో ఆచరించాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి స్వప్న,ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆలోచనలతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

- బీసీ సాధికారత సంఘం ఉత్తర తెలంగాణ ఇంచార్జి : పొలాస నరేందర్



వేములవాడ (ప్రశ్న న్యూస్) భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీసీ సాధికారిత సంఘం నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ ఇంచార్జీ పొలాస నరేందర్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్తగా, స్వతంత్ర భారత తొలి న్యాయ మంత్రిగా అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. రిజర్వేషన్ల ద్వారా సామాజిక న్యాయం సాధించేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అలాగే మహిళల హక్కులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని కొనియాడారు.అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందుల వెంకటేష్, పిన్నింటి హన్మాండ్లు, బిల్ల కృష్ణ, ముద్రకోల లింబాద్రీ, ముద్రకోల గణేష్, కత్రోజు జ్ఞానేశ్వర్, కత్రోజు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 135వ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న

## నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) డా. బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా నర్సాపూర్ పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అవుల రాజి రెడ్డి , మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు ఎంతో గొప్పవని, ఆయన రచించిన రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించిందని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వం, న్యాయం, సోదరభావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ఇతర నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు ప్రతి తరానికి మార్గదర్శకమని, యువత ఆయన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు .

# దళిత రత్న అవార్డుకు దక్కిన సన్మానం

## దళిత రత్న అవార్డు గ్రహీత బీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు యోహాన్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) గత సంవత్సరం భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ చేతులమీదుగా రవీంద్రభారతిలో దళిత రత్న అవార్డు అందుకున్న బహుజన జాగృతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గోషికే యోహన్ అయితే వారి సంత గ్రామంలో నిర్వహించిన 135వ జయంతి వేడుకల్లో కుల బాంధవులు గ్రామ పెద్దలు వారిని ఆ అవార్డుకు గౌరవాన్ని తెచ్చే విధంగా వారు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి చేతుల మీదుగా తీసుకున్నప్పుడు పొందలేని ఆనందం తగిన గౌరవం ఉత్సాహం సంతోషం పొందలేనంత ఈ అవార్డు అందుకోవడానికి అర్హత సాధించడానికి కారకులైన గ్రామ పెద్దలు కుల బంధువుల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం వారిచేత సన్మానించబడడం నన్ను ఎంతగానో ఆనందానికి గురిచేస్తుంది ఈ సందర్భంగా వీరందరికీ కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తూ ఇంకా మునుముందు ఏ ఏ అవకాశాలు ఏ అవార్డులు ఎంత పెద్ద ఘనత వచ్చిన కూడా కన్నతల్లి లాంటి గ్రామాన్ని కుల బంధువులను మర్చిపోను అని తెలియజేస్తున్నా ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పుర్రె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## అగ్ని ప్రమాదాల సంభవించినప్పుడు ప్రతి ఒక్కరు సహకరించాలి, వెంటనే సమాచారం అందించాలి.



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయం నందు అగ్నిమాపక అధికారి నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలోఅగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు, ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి పాల్గొనిఅగ్నిమాపక వారోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ఉపయోగించే యాంత్రిక పరికరాలను పరిశీలించారు. ఈ పరికరాలు ఏవిధంగా ఉపయోగిస్తారు అని అగ్నిమాపక అధికారి ఆర్డీవో కి వివరించారు ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి అగ్నిమాపక అధికారి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ:ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు, ఈ వారోత్సవాలు వారం రోజుల పాటు ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించినట్లు వివరించారు. సురక్షిత పాఠశాలలు, సురక్షిత ఆసుపత్రులు, అగ్ని భద్రతపై స్పృహ ఉన్న సమాజం -- మంటల నివారణకు కలిసి పనిచేస్తాయి అనే నినాదంతో ఈ కార్యక్రమాలు సాగుతాయని ఆయన పేర్కొన్నారు.వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్లు, పెట్రోల్ బంకులు, రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో 'మాక్ డ్రిల్స్' నిర్వహిస్తామని వెల్లడించారు.ప్రమాదవశాత్తూ మంటలు అంటుకున్నప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఎలా నివారించాలి, గ్యాస్ లీకేజీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక యంత్రాలను ఎలా ఉపయోగించాలో ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తామని ముఖ్యంగా వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువని, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

# ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్)రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని సూచించారు. ఆయన భారత ప్రజలకు అందించిన అద్భుత వజ్రాయుధమే భారత రాజ్యాంగం అన్నారు. అంబేద్కర్ కొందరి వాడు కాదు అందరివాడు అని,ఆయన ఆనాటి కాలంలో ఎదురైన అనేక సాంఘిక అవరోధాలను ఎదుర్కొని ఈ రోజు ప్రపంచ మేధావులలో ఒకరిగా ఖ్యాతి గడించారో అలాగే నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందడమే మనం ఆ మహనీయునికి చెల్లించే నిజమైన నివాళులు అని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోలా ఆనంద్ ఎప్పుడూ అప్రమత్తులై, విద్యావంతులై ఆత్మగౌరవంతో, ఆత్మ విశ్వాసంతో ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుందని అంబేద్కర్ అన్నారని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, టిడిపి నాయకులు బిజెపి నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# అపెక్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా

- ప్రజాసేవయే లక్ష్యంగా కొనసాగుతాం
- ఎ సి టీ వ్యవస్థాపక అధ్యక్షులు అడ్వకేట్ మాధవ్



పటాన్‌చెరు (ప్రశ్న న్యూస్ ) ఇంద్రేశం, అరతి నగర్ కాలనీలో అపెక్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వేసవి కాలంలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇంద్రేశం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పట్లోళ్ల హరీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవనే లక్ష్యంగా తీసుకుని పనిచేస్తున్న ట్రస్ట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. సమాజ సేవకు అంకితభావంతో ముందుకు వస్తున్న అడ్వకేట్ మాధవ్ కు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు అడ్వకేట్ మాధవ్ మాట్లాడుతూ, మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితోనే ఈ సంస్థను స్థాపించామని తెలిపారు. సేవా కార్యక్రమాలే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతూ భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవలు చేపడతామని చెప్పారు. వేసవి కాలం ముగిసే వరకు చలివేంద్రం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజలు అరతి నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా

# హైడ్రా దాడులు

మా పార్టీ కార్యాలయాన్నే ప్రభుత్వ భూమి పేరుతో కూల్చడం అన్యాయం
ఐలపూర్ మాణిక్ యాదవ్ కారుని కూడా ధ్వంసం చేయడం దారుణం
ప్రజల దాహార్తిని తీర్చే ఆర్వో ప్లాంట్ కూల్చివేతను ఖండిస్తున్నాం
పటాన్ చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి



అమీన్ పూర్ (ప్రశ్న న్యూస్ ) పటాన్‌చెరు నియోజకవర్గం ఐలాపూర్ గ్రామంలో హైడ్రా చర్యలను మరియు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ యువ నాయకుడు మాణిక్ యాదవ్‌కు చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రభుత్వ భూమి పేరుతో అక్రమంగా కూల్చివేయడం అన్యాయమని అన్నారు. అయితే ఆ స్థలం 1954 నుండి వారి పూర్వీకుల సొంతమని, భూ భారతి పోర్టల్ సహా అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు.ప్రభుత్వం ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఈ విధంగా కూల్చివేతలకు పాల్పడటం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని విమర్శించారు. ఇప్పటికే కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు.అదే సర్వే నంబర్‌లో ఉన్న కొన్ని నిర్మాణాలను వదిలిపెట్టడం ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని చూపుతోందని అన్నారు.అదేవిధంగా, అక్కడ నివసిస్తున్న కిరాయిదారులకు తమ సామగ్రిని బయటకు తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా హఠాత్తుగా కూల్చివేతలు చేపట్టడం అత్యంత అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.హైడ్రా పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కేవలం ఇళ్లను మాత్రమే లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలు చేపడుతున్నారని, రియల్ ఎస్టేట్ రంగం ఇప్పటికే మందగమనం లో ఉన్న సమయంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. నిజమైన ప్రభుత్వ భూములను గుర్తించి చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, జిన్నారం మాజీ జెడ్‌పీటీసీ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, పరమేష్ యాదవ్, నర్సింహ, అప్పల భాస్కర్, మాజీ సర్పంచ్ రాజు, అమీన్పూర్ మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, బిజిలిపురం రాజు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద రాజు, శివ, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 19న హైదరాబాద్‌లో 'బ్రాహ్మణ వధూ-వరుల పరిచయ వేదిక'

మల్కాజిగిరి(ప్రశ్న న్యూస్) బ్రాహ్మణ సమాజంలోని వధూ-వరులకు సరైన జీవిత భాగస్వామిని వెతుక్కునేందుకు ఒక చక్కని వేదికను ఏర్పాటు చేస్తున్నారు. భవానీ మ్యాట్రిమోనీ (విఎస్ బి అసోసియేట్స్) ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం హైదరాబాద్‌లో ప్రత్యేక పరిచయ వేదిక నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, కాపు కళ్యాణ ఫంక్షన్ హాల్, గీతా నగర్, సఫిల్‌గూడ, మల్కాజిగిరిలో ఏర్పాటు చేశారు. వైదీకి, నియోగి, ద్రావిడ, మధ్వ, శ్రీ వైష్ణవ వంటి అన్ని శాఖల బ్రాహ్మణ వధూ-వరులు. అలాగే మొదటి వివాహం, లేట్ మ్యారేజ్,ద్వితీయ వివాహ సంబంధాల కోసం ఎదురుచూసే వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగానే తమ ఫోటో మరియు బయోడేటాను వాట్సాప్ ద్వారా పంపి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం రిజిస్ట్రేషన్ కొరకు 9704656103 లేదా 9533608887 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను అమలు చేయాలి: కొంగరి శంకర్



తార్నాక(ప్రశ్న న్యూస్) అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఈ విషయాన్ని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకొని ఎస్సీ ,ఎస్టీ సబ్ ప్లాన్ ను అమలు చేయాలి అని మాదిగ హక్కుల దండోరా అధ్యక్షుడు కొంగరి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేద్కర్ 135 జయంతిని పురస్కరించుకొని ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొంగరి శంకర్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలు కొనసాగే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. నేటి యువత అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఆ బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా నాయకులు, ఉస్మానియా యూనివర్సిటీ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ



నాచారం(ప్రశ్న న్యూస్) డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రాగిరి జ్యోతి మోహన్ రెడ్డి సేవ సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నాచారం డివిజన్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన జయంతి వేడుకల నేపథ్యంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆర్జేఎంఆర్ సేవా సంస్థ చైర్మన్ రాగిరీ మోహన్ రెడ్డి మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి తాపానికి మజ్జిగ అందించడంపై మోహన్ రెడ్డిని పలువురు నేతలు అభినందించారు.

# సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం



నాచారం(ప్రశ్న న్యూస్)అంబేద్కర్ జయంతి వేడుకలు నాచారం లో ఘనంగా నిర్వహించారు. నాచారం అంబేద్కర్ విగ్రహం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలోఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. పరమేశ్వర్ రెడ్డి, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డిలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానం ప్రపంచానికి ఆదర్శం అని తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టిన సంతోష్ రెడ్డిని ఆయన అభినందించారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ మహనీయులైన అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ తండ్రులు బ్రిటిష్ భారతీయ సైన్యానికి చెందినవారని, పూలే కుమారుడు కూడా ఆర్మీ కి చెందిన వ్యక్తి అని తాను కూడా ఆర్మీ లో పనిచేసి వచ్చినవాడినని తాము సైనిక కుటుంబం అని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు మహనీయుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాచారం అంబేద్కర్ విగ్రహం కమిటీ సభ్యులు, వివిధ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో సమాన సమాజ నిర్మాణం సాధ్యం

### ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు, బోయినిపల్లి సెస్ డైరెక్టర్ : కొట్టెపల్లి సుధాకర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో మంగళవారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యుడు, బోయినిపల్లి సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం నేటికీ ప్రాసంగికమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టి సమాన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆలోచనలే మార్గదర్శకం - గురుకులాలపై కీలక వ్యాఖ్యలు

### - సెంట్రలైజేషన్ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి
### - దళిత సంఘాల రాష్ట్ర నాయకులు, సాయి హర్షిణి ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ : బండపల్లి ఆంజన్ కుమార్



కరీంనగర్ / కొడిమ్యాల కరీంనగర్ పట్టణ కేంద్రంలో మంగళవారం 135వ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి హర్షిణి ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్, దళిత సంఘాల రాష్ట్ర నాయకులు బండపల్లి అంజన్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల కోసం అంబేద్కర్ చేసిన విశేష కృషిని గుర్తుచేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం గురుకుల పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 17 ద్వారా అమలు చేస్తున్న సెంట్రలైజేషన్ కాంట్రాక్ట్ విధానంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల చిన్న కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందడం కష్టమవుతుందని తెలిపారు.సెంట్రలైజేషన్ విధానాన్ని రద్దు చేసి, ప్రతి పాఠశాలకు ప్రత్యేకంగా చిన్న కాంట్రాక్టర్ల ద్వారా సరుకులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించినట్లు ఆంజన్ కుమార్ పేర్కొన్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో విలాసాగర్ గ్రామంలో సర్పంచ్ కనుకయ్య ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,విలాసాగర్ గ్రామంలో డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయాలు అన్ని వర్గాలకు సమాన న్యాయం కల్పించాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొత్తూరి శైలజ, వార్డు సభ్యులు దమ్మ వెంకటరమణ, పోలె శేఖర్, జోగు శంకర్, సుంకపాక హేమలత అనిల్, కొంకటి సతీష్, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, కళ్లెపెల్లి సతీష్ కుమార్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బొడ్డు దేవయ్య, గౌరవ అధ్యక్షులు సుంకపాక ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సమానత్వం కోసం అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలి

### - కాంగ్రెస్ పార్టీ నర్సింగాపూర్ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు : లింగంపల్లి శ్రీనివాస్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ దేశానికి సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు అమూల్యమైనవని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, భారత రాజ్యాంగ శిల్పిగా సామాజిక న్యాయానికి చిరస్మరణీయ చిహ్నంగా నిలిచారని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి పౌరుడు కొనసాగించాలని కోరారు. దేశంలోని అన్ని మతాలు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తాయని, "సకల జనుల వాడు అంబేద్కర్" అని పేర్కొన్నారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అంబేద్కర్ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని అనేక పోరాటాలు చేసి విజయాన్ని సాధించారని గుర్తు చేశారు.అంబేద్కరిజం అంటే నిరంతర అధ్యయనం, సమీకరణ, పోరాటం అని, యువతకు "చదువు, సమీకరించు, పోరాడు" అనే నినాదాన్ని అందించారని అన్నారు. సమాజంలో కుల వివక్ష, అసమానతలు తొలగించేందుకు అంబేద్కర్ జీవితాంతం పోరాటం చేశారని వివరించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, కౌన్సిలర్లు మరియు పలువురు ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నేతల ఘన నివాళులు



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్ పరిధిలోని ఎర్రవెల్లి, సింగారం, గజ్వేల్ పట్టణశీల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ ఆశయాలను స్మరించుకున్నారు.అలాగే గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సహపంక్తి భోజన కార్యక్రమాన్ని నిర్వహించి సామాజిక సమానత్వాన్ని ప్రతిబింబించేలా చర్యలు చేపట్టారు.ఇక ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద నిర్వహించిన అన్నప్రసాదం కార్యక్రమంలో కూడా పాల్గొని ప్రజలకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా అంబేద్కర్ గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సమానత్వ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు.గజ్వేల్‌లో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శమీమ్ పాల్గొని అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ సమాజంలో సమానత్వం, న్యాయం కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ డిస్టిక్ కోఆర్డినేటర్ మహమ్మద్ అజార్.వైస్ ప్రెసిడెంట్ రజియాబేగం, ఆపరేషన్ ఆఫీసర్ విమల. ఖాజ. యాదమ్మ. బాబా. షబానా తదితరులు పాల్గొన్నారు.

## కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.25 కోట్ల అవినీతి

**కదిరి** కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.25 కోట్ల అవినీతి జరిగిందని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులపై కలెక్టర్ కు ఫిర్యాదు చేసారు. రిజిస్ట్రేషన్ వ్యాల్యూ తగ్గించి.. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొట్టారని ఫిర్యాదు లో పేర్కోన్నారు. కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 25 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. టీడీపీ నేతల అండదండలతో స్కాం జరిగిందని అనుమానం వ్యక్తం చేసారు. సమగ్ర విచారణ జరిపించాలని వినతి పత్రం అందజేసారు.

## కొలిమిగుండ్లలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని మండల తెలుగుదేశం పార్టీ కమిటీ సూచన మేరకు పార్టీ కార్యాలయం, మరియు లక్ష్మీ నగర్ కాలనీలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ లో మంగళవారం నాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి వేడుకలను టిడిపి నాయకులు, మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు.

## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ, జయంతి వేడుకలు

**హుస్నాబాద్** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో బీజేపీ పార్టీ అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కనపేట మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా దేశ గమనాన్ని మార్చిన అంబేద్కర్ విజ్ఞానానికి, పోరాటానికి నిలువెత్తు రూపంఅని అన్నారు.సమాజంలోని అసమానతలను రూపుమాపి, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయని, అంబేద్కర్ ఆశయాలను గౌరవిస్తూ, అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలను అందిస్తూ నవ భారత నిర్మాణానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా కౌన్సిల్ మెంబర్ కర్ణకంటి నరేష్ మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్ మడక రవికుమార్ చౌడు తండా ఉపసర్పంచ్ అర్జున్ నాయక్ బిజెపి సీనియర్ నాయకులు మోహన్ నాయక్ జంగపల్లి శ్రీనివాస్ చందుపట్ల నాగరాజు. తీగుల చంద్రం కొండ్ల సంజీవరెడ్డి జన్నారపు కళ్యాణ్. బత్తిని జీవన్, గిరిమల్ల రాజు,ఇటీకాల రాజశేఖర్, వేముల శ్రీనివాస్,రాజు,తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువత అంబేద్కర్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలి

**సిద్దిపేట** సిద్దిపేట జిల్లా నారాయణ రావు పేట మండలం బంజేరుపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ మంత్రి హరీష్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికి డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్ 135వ జయంతి శు భాకాంక్షలు. అంబేద్కర్ చదువుకున్న చదువుకుని మంచి జీవితాన్ని ఆయన పొందేవారు. కానీ ఆయన అలా ఆలోచించలేదు. నా చదువు నా కోసం కాదు నా దేశం కోసం నా అణగారిన వర్గాల కోసం అని ఆలోచించిన నాయకుడు అంబేద్కర్. దేశ విదేశాల్లో చదువుకొని ప్రపంచాన్ని అర్థం చేసుకొని మన రాజ్యాంగాన్ని అద్భుతంగా రచించారు . ఆయన రచించిన రాజ్యాంగం వల్ల మన దేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్నది. అమెరికాలాంటి దేశంలోనే మహిళలకు ఓటు హక్కు రావాలంటే దశాబ్దాల కాలం పట్టింది..కానీ మన దేశానికి స్వతంత్ర్యం వచ్చిన వెంటనే..రాజ్యాంగం ద్వారా ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి బాబాసాహేబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్. ఆయన పెట్టిన బిక్ష వల్లే అందరూ పెద్ద పెద్ద చదువులు, ఎమ్మెల్యేలు ఎంపీలు అవుతున్నారు. ఆయన రాసిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ కల సాకారం అయ్యింది. – ఆయన ఎంతో దూర దృష్టితో ఆలోచించి కొత్త రాష్ట్ర ఏర్పాటుకు అసెంబ్లీ తీర్మానం అవసరం లేదని రాశారు. దళితబంధు కేసీఆర్ 10 లక్షలు ఇస్తున్నాడు మేం 12 లక్షలు ఇస్తామన్నారు ఏమైంది ఇవ్వలేదు.

ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లేకుండా పోయింది. పోయిన సంవత్సరం ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్కు 3300 కోట్లు బడ్జెట్లో పెట్టింద్రు కానీ ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. బోధించు సమీకరించి పోరాడు ఇదే అంబేద్కర్ గారు చెప్పిన గొప్ప సిద్ధాంతం . అన్యాయాలు అక్రమాలు చేస్తున్న ప్రభుత్వాలపై పోరాడండి అని ఆయన చెప్పారు. పోరాటమే లేకపోతే తెలంగాణ వచ్చేదా..? ఏ వర్గమైనా ఏ ప్రాంతం అయినా మనకు అన్యాయం జరుగుతుందంటే గొంతు విప్పాలి. కెసిఆర్ ప్రపంచంలోనే అతిపెద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నేర్పించారు. ఈ రేవంత్ రెడ్డి వచ్చిండు ఆ విగ్రహానికి తాళం వేసిండు . నేను మొన్న లండన్ పోయినప్పుడు చూసినా అక్కడ అంబేద్కర్ నివసించిన ఇంటిని మ్యూజియం గా మార్చారు దేశ విదేశాల నుండి ఆయన మ్యూజియంలో చూడడానికి వస్తుంటారు. నేటి యువత అంబేద్కర్ ని స్ఫూర్తిగా తీసుకోవాలి..పేదరికం అనేది చదువుకోవడానికి అడ్డు రాకూడదని అంబేద్కర్ ని చూసి నేర్చుకోవాలి. అందరికీ సమాన హక్కులు మాటల్లో కాదు.. చేతల్లో ఉంటేనే సమాజం బాగుపడుతుంది. పిల్లలను బాగా చదివించండి.. చదువు ఉంటేనే బాగుపడుతామని అన్నారు.

## దేశానికి డా.బి ఆర్ అంబేద్కర్ చేసిన సేవలు ఎనలేనివి : జిల్లా ఎస్పీ మహేష్ గీతే

- ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు
- డా.బిఆర్ అంబేద్కర్రి జయంతి వేడుకల సందర్భంగా ఆరైవ్ - అలైవ్ లో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ కార్యక్రమాలు



**రాజన్న సిరిసిల్ల** : దేశానికి డా.బి.ఆర్ అంబేద్కర్ చేసిన సేవలు ఎనలేనివనీ జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే . కొనియాడారు భారతరత్న డా.బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... డా.బి ఆర్ అంబేద్కర్ ప్రపంచంలోనే పేరొందిన గొప్ప న్యాయవాది,మానవతావాది అని,లండన్ లో ప్రముఖ విశ్వ విద్యాలయం డా.బి ఆర్ అంబేద్కర్ కు మాస్టర్ ఆఫ్ ఆల్ సైన్సెస్ ప్రధానం చేసిందన్నారు అన్ని అంశాల్లో పట్టున్న గొప్ప సామాజిక సంఘ సంస్కర్త అని అన్నారు.దేశానికి ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగమును రాసి భవిష్యత్తులో దేశం ఎదుర్కొనే అనేక సవాళ్లకు పరిష్కార మార్గాలు చూపారని కొనియాడారు.డా.బిఆర్ అంబేద్కర్ కలలుగన్నా దేశంగా, సూపర్ పవర్ గా భారత్ ఎదగాలంటే తల్లిదండ్రులు పిల్లలని చదువు వైపు ప్రోత్సాహించాలని , నేటి యువత అంబేద్కర్ ఆశయాల తో ముందుకు సాగుతూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు.

## టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావుకు నిరసన సెగ

**రాజమండ్రి** టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావుకు నిరసన సెగ తగిలింది. దళితులపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన అప్పారావుపై దళిత నేతల ఆగ్రహం వ్యక్తం చేసారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా క్వారీ సెంటర్లో విగ్రహానికి పూలమాల వేసేందుకు వచ్చిన ఆదిరెడ్డి అప్పారావు కు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అర్హత లేదంటూ దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. టీడీపీ నేతను అడ్డుకునే ప్రయత్నం చేసారు. ఆదిరెడ్డికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. దళిత సంఘాల ఆందోళనతో ఆదిరెడ్డి కాన్వాయ్ వెనుతిరిగింది.

## సిఐటియు నేతలపై జనసేన ఎమ్మెల్యే వంశీ ప్రతాపం

**విశాఖపట్నం** సిఐటియు నేతలపై జనసేన ఎమ్మెల్యే వంశీ ప్రతాపం చూపించారు. నైట్ ఫుడ్ కోర్ట్ తెరిపించమని ఎమ్మెల్యేకు సిఐటియు నేతలు వినతిపత్రం సమర్పించారు. వినతి పత్రాన్ని కమ్యూనిస్టు నేతలపై ఎమ్మెల్యే వంశీ కృష్ణ విసిరి కొట్టారు. నైట్ ఫుడ్ కోర్టు తెరిపించాలని గత కొన్ని రోజులుగా నైట్ ఫుడ్ కోర్ట్ బాధితులు రిలే నిరాహార దీక్షల చేస్తున్నారు.

## చందనోత్సవం టికెట్ల జారీలో గందరగోళం

### - బ్యాంకుల బారులు తీరిన భక్తులు

**సింహాచలం** సింహాచలం చందనోత్సవ టికెట్ల జారీలో గందరగోళం ఏర్పడింది. టికెట్లు అరకొరగా విక్రయిస్తున్నారని భక్తులు దేవస్థానం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. బ్యాంకుల వద్ద జనం బారులు తీరుతున్నారు. సింహాచలం ఎస్బీఐ, యూనియన్ బ్యాంకుల వద్ద తోపులాట జరిగింది. గంటల తరబడి క్యూ లైన్ లో ఉన్నా కొంతమంది భక్తులకు నిరాశ తప్పడంలేదని ఊసూరుమంటున్నారు.

## దళిత మహిళను దూషించిన టీడీపీ నేతలు

**అనంతపురం** వైసీపీ దళిత మహిళా నేత మంజులను టీడీపీ నేతలు అసభ్య పదజాలంతో దూషించారు. అనంతపురం అంబేద్కర్ విగ్రహం వద్ద ఘటన జరిగింది. అంబేద్కర్ జయంతి సందర్భంగా పూలమాలలు వేసేందుకు వైసీపీ నేతలు వెళ్లారు. టీడీపీ నేతలు దూషించటంతో వైసీపీ మహిళా నేత మంజుల కంట తడిపెట్టింది. టీడీపీ నేతల తీరుపై వైసీపీ నేతలు నిరసన తెలిపారు.

## ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి.

### మంథనిలో అంబరాన్ని అంటిన సంబరాలు

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళ్తామని కేవలం దళితులకు సంబంధించిన వారే కాదు అని, అన్ని వర్గాలకు అన్ని కులాలకు సంబంధించినటువంటి వారు అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.మా నాయకుడు రాహుల్ గాంధీ ప్రతినిత్యం అంబేద్కర్ రచించినటువంటి రాజ్యాంగాన్ని చేతిలో పెట్టుకొని వాటికి అనుగుణంగా ముందుకు పోవాలని తెలుపుతున్నారని. మా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందరికీ మేలు జరగాలి అందరు బాగుండాలని కోరుకుంటున్నాం అని అన్నారు. గత 10 సంవత్సరాల కాల హయంలో ఇందిరమ్మ ఇండ్లు లేని వారికి బడుగు బలహీన వర్గాలకు ఇండ్లు ఇచ్చే కార్యక్రమం చేస్తా ఉన్నాం, మంథని పట్టణంలో బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు మీద పోటీ పరీక్షలకు సన్నధమయ్యే వారి కోసం మంథనిలో బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ పెట్టడం జరుగుతుందని తెలిపారు. మా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని నియోజకవర్గ కేంద్రాలలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. పోటీ పరీక్షలకు సమర్థమయ్య విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన చేపించడం జరుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అంబేద్కర్ చూపించిన సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తామని వారి ఆశయం సాధనలో తమ వంతు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఎస్సీ సెల్ నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా సాగిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలు.

### మంథనిలో అంబేద్కర్,కు పూలమాలవేసి నివాళులర్పించారు

### పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ



మంథని ( ప్రశ్న న్యూస్) పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మంథనిలో అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే మేమందరం ప్రజాసేవలో పనిచేస్తున్నామని పేర్కొన్నారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, పూలమాలవేసి నివాళులు అర్పించి. ఈ సందర్భంగా గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు–సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా ప్రాముఖ్యత–ప్రతి ఒక్కరూ ఆచరించాలని అంబేద్కర్ అంటే ఒక శక్తి ప్రపంచ మేధావి ఈ ప్రపంచంలోనే రెక్కలను విప్పి పనిచేసే ప్రతి వ్యక్తికి ఆయన ఒక శక్తిగా ఎదగాలని ప్రశ్నించే తత్తము మనలో నిత్యం ఉండాలని అణగారిన వర్గాల కోసం ఆయన జీవితాన్ని త్యాగం చేసిన ఒక త్యాగధనుడని ఎంపీ గడ్డం వంశీకృష్ణ కొనియాడారు అంబేద్కర్ గురించి ఎంత మాట్లాడుకున్న తక్కువేనని ఆయనే లేకుంటే భారతదేశానికి రాజ్యాంగమే లేదని మేధావులు రాజకీయ విశ్లేషకులు తెలియచేస్తున్నారు

## జాతిని జాగృత పరిచిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న గుమ్మడి శ్రీవల్లి



మహబూబ్ నగర్ (ప్రశ్న న్యూస్) ఏప్రిల్ 14 ఎవ్వరు మర్చిపోలేని తేదీ ఇది. దేశం మొత్తం ఉత్సవాలతో పెద్ద జాతరల కొనసాగే డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ జయంతి మహబూబ్నగర్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా లో జరిగిన బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం స్టేట్ కోఆర్డినేటర్, మహిళా నాయకురాలు గుమ్మడి శ్రీవల్లి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఉద్యమకారులు, దళిత నాయకులు, వివిధ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అనేక రంగాల్లో పనిచేసే కార్మికులు, సాధారణ ప్రజలు కూడా పాల్గొనడం జరిగింది.

## సామాజిక న్యాయశీ అంబేద్కర్ చూపిన మార్గం

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా మంగళవారం మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు , అదనపు కలెక్టర్ నగేష్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణ కోసం చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. భారత రాజ్యాంగ రూపకర్తగా దేశ నిర్మాణంలో ఆయన చేసిన అపార సేవలను స్మరించుకున్నారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, విద్యా,ఉపాధి అవకాశాలు అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితోనే కొనసాగుతున్నాయని తెలిపారు. యువత అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆదర్శప్రాయుడని, అంబేద్కర్ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్ని ఉన్నత స్థాయిలో ఎదిగారని అందరికీ ఆదర్శప్రాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య,డిఆర్డిఓ శ్రీనివాసరావు, డీఎఫ్ఓ జోజి,మున్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక భూపతి రాజ్,ఆర్డీవో రమాదేవి ,టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్,రాజ్ కుమార్, కమిటీ గౌరవ అధ్యక్షులు ఆకుల పెంటయ్య, ఉత్సవాల కమిటీ చైర్మన్ దుబాషి సంజీవ్, వైస్ ఛైర్మన్ గరుగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుర్గ ప్రసాద్, కడారి నాగరాజు,పాతూరి రాజు, సంజీవ, మురళీ, మైసయ్య, శ్యామిల్, బాలరాజు, అశోక్ ,యాదగిరి, సురేష్, సంగమేశ్వర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## మనం గౌరవంగా బతుకాలన్నదే మహనీయుల ఆలోచన...

- మన ఆత్మగౌరవం..ఆకలి కోసం ఆలోచన చేయని మూడోట్లున్న కుటుంబం
- అవమానాల నుంచి ఉద్భవించిందే మహనీయుల దీక్ష
- ఐస్‌గడ్డతో చంపే ఎమ్మెల్యే ఉండగా ఇంకా నరకడమెందుకు

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**





మంథని ( ప్రశ్న న్యూస్) 7 మన సమాజం గౌరవంగా బతుకాలన్నదే మహనీయుల ఆలోచన అని, ఆనాడు ఆ ఆలోచన చేసిన మహాత్మాజ్యోతిరావు పూలేను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బారత రాజ్యంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం మంథని మున్సిపల్ పరిధిలో అంబేద్కర్‌నగర్. ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటి వరకు మహనీయుల చరిత్రను తెలుసుకోమో అప్పటి వరకు చరిత్రను సృష్టించలేమన్నారు. 199 సంవత్సరాల క్రితం మనకోసం ఆలోచించి అవమానపడి చనిపోయిన మహాత్మ జ్యోతిరావు పూలే చరిత్రను అంబేద్కర్ అర్థం చేసుకున్నారని ఆయన గుర్తు చేశారు. మనకు ఓటు ఉంటేనే గౌరవిస్తరని ఆనాడే ఆలోచన చేసి ఓటు ఇచ్చినా ఇవాల్టి వరకు ఎదుటి వాళ్లు ఎందుకు గౌరవించబడుతాండ్లో బీసీలు ఎస్సీలు మైనార్టీలు ఎందుకు అగౌరవించబడుతుండ్లో అర్థం కావడంలేదని ఆయన వాపోయారు. 80శాతం ఉన్న మన ఓట్లను వేయించుకుని మూడు ఓట్లు ఉన్న ఒక కుటుంబం రాజ్యం ఏలుతూ మన ఆత్మగౌరవం, సమాజం ఆకలి కోసం ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. మహనీయులు ఎప్పటి వరకు సమాజంకు తెలియదో అప్పటి వరకు గౌరవించబడమని అర్థం అయిందని, ఆ అమానం నుంచి ఉద్భవించిందే ఈ మహనీయుల దీక్ష అని ఆయన అన్నారు. ఆనాడు అంబేద్కర్‌నగర్‌లోకి కుంటలోకి మురికినీరు తీసుకువచ్చి ఇప్పుడున్న ఎమ్మెల్యే మళ్లీ అదే అంబేద్కర్‌కుంటను మురికికూపంలా మార్చాలని చూస్తున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బన్నెచెరువు నుంచి నీళ్లు అంబేద్కర్‌కు తీసుకువచ్చి, మూడేళ్ల కాలంలో చుక్కనీరు రాకుండా చేశారన్నారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగం పట్టుకుని దేశమంతా తిరుగుంటే ఇక్కడి ఎమ్మెల్యే మాత్రం రాజ్యాంగం పట్టుకోడన్నారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో అంబేద్కర్ ఫోటోలు ఫ్లెక్సీలో పెట్టి అధికారంలోకి వచ్చినతర్వాత ఎక్కడా ఫోటోలు కన్పించడం లేదని, మూడు ఓట్లు ఉన్న కుటుంబానికి 80శాతం ఉన్న సమాజాన్ని వాడుకోవడం తప్ప వారి గురించి ఆలోచన చేయరన్నారు. మనం ఓట్లు వేసి గెలిపించి అధికారం ఇస్తే ఐటీ కంపెనీలు వస్తే ఓట్లేసిన సమాజానికి భవిష్యత్ కోసం మాత్రం ఆలోచన చేయరన్నారు. రాజ్యాంగంలో పదేండ్ల వరకు అందరు సమానం కావాలని ఉంటే 75ఏండ్ల తర్వాత కూడా ఇండ్లు, పెన్షన్ ఇచ్చినం ఎమ్మెల్యే చెప్పుకోవడం ఎంత అవమానమో అని అన్నారు. ఎన్ని ఆటంకాలు ఇబ్బందులు ఎదురైనా సమాజం చైతన్యం మేలు కొలుపుకు తాము పోరాటం చేస్తామని, ఈనాడు రామగుండం ఎమ్మెల్యే నరికేస్తం అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇక్కడే ఐస్ గడ్డతో చంపేసే ఎమ్మెల్యే ఉండగా మీరు నరుకుడెందుకన్నారు. ఎమ్మెల్యేలకు అర్థం కావాలే ఇండ్లు కూలిగొట్టినంత ఈజీ కాదు నరికేస్తమని మాట్లాడటం అని అన్నారు. అట్టడుగు వర్గాల కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయులే తమకు ఆదర్శమని, ఆ దిశగానే పోరాటం చేస్తామని అన్నారు. అనంతరం మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దీక్షాపరులను స్థానిక నాయకులు పూలతో అభిషేకం చేసి అభినందనలు తెలిపారు.

## మంథనిలో ఆగని అక్రమ మట్టి దందా...

**అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం...**

**ఆదివారం వేళల్లో తనిఖీలు లేక అక్రమ మట్టి నిర్వహకుల ఇష్టరాజ్యం...**





మంథని ( ప్రశ్న న్యూస్) మంథనిలో అక్రమ మట్టి రవాణా నిర్వాహకుల ఆగడాలు హెచ్చుమీరుతున్నాయి ఆదివారం వేళల్లో రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేని సమయంలో అక్రమ మట్టి ట్రాక్టర్ల రవాణా తంతు కొనసాగుతుంది. వివరాల్లోకి వెళితే గత ఆదివారం నాడు మంథని ప్రాంతంలోని అటవీ ప్రాంతాల నుండి గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న మట్టి మాఫియా అంటూ వివిధ పత్రికా ప్రకటనలు వచ్చినప్పటికి రెవెన్యూ అధికారుల తనిఖీలు,పర్యవేక్షణ లేకపోవడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రెవెన్యూ అధికారులు, సంబంధిత ఆర్ ఐ ల తనిఖీలు లేకపోవడం అదును చూసుకొని తిరిగి ఈ ఆదివారం సైతం మట్టి అక్రమ రవాణా కొనసాగింది ఈ అక్రమ మట్టి రవాణా కు అడ్డుకట్ట వేసేవారు కరువయ్యారు ఎలాంటి అనుమతి లేకుండా మంథని ప్రాంతంలో చెరువులు,కుంటలు, కొండలు, గుట్టలు,కొల్లగొడుతూ, ఫారెస్ట్ రెవెన్యూ అధికారుల కళ్లేదుటే జోరుగా మట్టిని తరలిస్తున్నారు అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయం అధికారుల దృష్టికి పోయిన ట్రాక్టర్ లను గుర్తించి సీజ్ చెయ్యకపోవడం పట్ల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం అర్థమవుతుతుంది మంథని ప్రాంతంలో లో రెవెన్యూ అధికారులు అక్రమ మట్టి ట్రాక్టర్ లను సీజ్ చెయ్యకుండా క్షేత్రస్థాయిలో మట్టి మాఫియా ను కట్టడి చెయ్యడం లో విఫలమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది రెవెన్యూ అధికారులు ఆర్ ఐ లేదా సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రకృతి సంపద ఐనా మట్టిని అక్రమ మట్టి మాఫియా నుండి అరికట్టాలని అడవిని తోడిన వారి తో పాటు అక్రమ మట్టి చేరావేస్తున్న మట్టి ట్రాక్టర్ లను, జేసీబీ లను గుర్తించి సీజ్ చేసి అక్రమ మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొరైంకల సురేష్ డిమాండ్ చేసాడు.

## వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా వడ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) వేసవి కాలంలో తీవ్ర వడగాలులు (ఎమ్ఫ్ ఝుజవ) నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. వడదెబ్బ కారణంగా ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడకుండా ఉండేందుకు జిల్లా పరిపాలన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో తాగునీటి సరఫరా, చలివేంద్రాల ఏర్పాటు, ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు మరియు ాాా నిల్వలు, బహిరంగ ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా కార్మికులు, వృద్ధులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు వంటి సున్నిత వర్గాల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచించారు. పుష్కలంగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని, తేలికపాటి దుస్తులు ధరించాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.అలాగే, జిల్లా వ్యాప్తంగా బస్ స్టాండ్లు, మార్కెట్లు, పనిస్థలాల్లో తాగునీరు నీడ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు.వడగాలుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

### వడగాలుల ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యం

ప్రజలను వడదెబ్బ (ఎమ్ఫ్ ౯తీశీఎవ) నుండి రక్షించడంముందస్తు చర్యల ద్వారా అనారోగ్యం, మరణాలు తగ్గించడంఅన్ని శాఖలు కలిసి పని చేయడంఆరోగ్య శాఖ ముఖ్య చర్యలుడాక్టర్లు, ాచీవీం, ఆశా వర్కర్లకు శిక్షణ ాాా, మందులు అందుబాటులో ఉంచడంవడదెబ్బ లక్షణాలు గుర్తించడం ఒ చికిత్సప్రజలకు అవగాహన కార్యక్రమాలుప్రమాదంలో ఉన్నవారు: ప్రజలకు సౌకర్యాలుచల్లటి తాగునీరు (చలివేంద్రాలు) ఏర్పాటుషెల్టర్లు, కూలింగ్ సెంటర్లు ఏర్పాటుపార్కులు, పబ్లిక్ ప్రదేశాలు తెరిచి ఉంచడంపేదలకు నీటి పంపిణీ కార్మికుల కోసం పనిస్థలాల్లో నీడ, నీరు, ాామధ్యాహ్నం వేడి సమయంలో పని తగ్గించడంఅవగాహన శిబిరాలురవాణా శాఖ చర్యలుబస్ స్టాండ్లలో నీరు, నీడమధ్యాహ్నం (12--4) బస్సుల పరిమితిడ్రైవర్లు, కండక్టర్లకు రక్షణప్రయాణికులకు ఆరోగ్య సదుపాయాలు పాఠశాలలుబహిరంగ తరగతులు నిలిపివేతతాగునీరు, ఫ్యాన్లు, కూలర్లువేడి సమయంలో పని గంటల మార్పు వ్యవసాయం ఒ ఇతర శాఖలురైతులకు సహాయంపశువులకు చల్లదనం సదుపాయాలునీటి సరఫరా పర్యవేక్షణ వడదెబ్బ లక్షణాలుఅధిక జ్వరం (104ళీఖీ పైగా)తలనొప్పి, తల తిరగడంవాంతులుచెమట తగ్గడంగుండె వేగంగా కొట్టుకోవడం డీహైడ్రేషన్ లక్షణాలునోరు ఎండిపోవడందాహంమూత్రం తగ్గడంతల తిరగడంచేయవలసినవినీరు ఎక్కువగా తాగాలిచల్లని ప్రదేశాల్లో ఉండాలి తెలుపు/పత్తి దుస్తులు ధరించాలిగొడుగు/టోపీ వాడాలిమజ్జిగ, ాాా తీసుకోవాలి

చేయకూడనివిఎండలో ఎక్కువసేపు ఉండకూడదునలుపు, మందపాటి దుస్తులు వేసుకోకూడదునీరు తక్కువగా తాగకూడదువడదెబ్బ వచ్చినవారిని ఆలస్యం చేయకూడదు వడదెబ్బ వచ్చినప్పుడు ఏమి చేయాలి?వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకెళ్లాలిచల్లటి నీటితో శరీరం చల్లబరచాలి ాాా ఇవ్వాలిపరిస్థితి మెరుగుపడకపోతే ఆసుపత్రికి తరలించాలని మంగళ వారం ఒక ప్రకటన తెలిపారు.

## గంగపుత్రులు అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకోవాలి

### తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి


### టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) పద్మారావు నగర్ లో భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అంబేద్కర్ విగ్రహానికి పుల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచు బడుగు బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసము పోరాడిన అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని గంగపుత్రులు తమ న్యాయమైన హక్కుల కొరకు ఉద్యమించాలన్నారు

# అటకెక్కిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

**- అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన ప్రభుత్వ లక్ష్యాలు - ఎక్కడ సమస్యలు అక్కడే పట్టించుకోని వైనం**






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రస్తుతం కాగితాలకే పరిమితమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ రూపొందించిన ఈ బృహత్తర కార్యక్రమం అమలులో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం బయటపడుతోంది. ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతుండగా, వాటిని పరిష్కరించాల్సిన అధికారులు మాత్రం నామమాత్రంగా స్పందించడం గమనార్హం. ప్రభుత్వం ప్రకటించిన కార్యక్రమాలను కూడా అధికారులు బుట్ట దాఖలు చేయడం ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేస్తుందిఈ కార్యక్రమం ప్రభుత్వం ప్రకటించినప్పుడు ప్రజల్లో భారీ ఆశలు నెలకొన్నాయి. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు ప్రజల సమస్యలను గుర్తించి, తక్షణ పరిష్కారం చూపిస్తామని పాలకులు హామీలు ఇచ్చారు. కానీ వాస్తవ పరిస్థితి చూస్తే, ప్రణాళిక అమలు పూర్తిగా నిలిచిపోయినట్లు కనిపిస్తోంది. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, ఉన్నత అధికారులలో బాధ్యతల పట్ల నిర్లక్ష్యం కారణంగా ఈ కార్యక్రమం అసలు ముందుకు కదలడం లేదు.

### కాగితాలకే పరిమితమైన ప్రణాళిక

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను భారీగా ప్రచారం చేసినప్పటికీ, అది ఫీల్డ్ స్థాయిలో అమలు కావడం లేదు. ఫైళ్లలో మాత్రమే పని పూర్తయ్యిందని చూపిస్తూ, వాస్తవంగా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని విమర్శలు వస్తున్నాయి. అధికారులు నివేదికలు తయారు చేసి పంపుతున్నా, వాటిలో నిజమైన పురోగతి ఎక్కడ కనిపించడం లేదు. మంత్రుల దృష్టికి తీసుకువచ్చిన వాళ్లు కూడా స్పందించకపోవడంతో అసలు ఈ కార్యక్రమం కేవలం ప్రకటనకే పరిమితమైందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

### ప్రజల సమస్యలు యథాతథం

99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ వంటి ప్రాథమిక సమస్యలు ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నాయి. స్థానిక అధికారులకు, ఉన్నత అధికారులకు ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, స్పందన లేకపోవడం వల్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ప్రజలు అధికారులను సంప్రదించినా, వారి సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాకపోవడం ఆగ్రహానికి దారితీస్తోంది. దానితో ప్రభుత్వం ప్రకటించిన కార్యక్రమాలను కూడా అధికారులు నిర్వహించకుంటే వాళ్లని ప్రశ్నించవలసిన ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోకపోవడం విడ్డూరంగా మారింది.

### మీడియా కవరేజీపై నియంత్రణ.?

99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంపై ప్రతికూల వార్తలు బయటకు రాకుండా పాలకులు, అధికారులు చాలా జాగ్రత్త పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పత్రికల్లో కథనాలు రాకుండా జర్నలిస్టులపై ఒత్తిడి తెస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉన్నా, వాటిని అధికారులు దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.ప్రభుత్వం ప్రకటించిన కార్యక్రమాలు సక్రమంగా అమలు కాకపోవడంతో మంత్రుల పాలనపై ప్రజల నుండి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ మంత్రులు ఒక్క కార్యక్రమాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమవడం పాలనా వైఫల్యంగా మారుతోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ప్రజల కోసం రూపొందించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, నిజంగా అమలు చేయాల్సిన అవసరం పాలకులపై అధికారులపై ఉంది. అధికారులు బాధ్యతతో వ్యవహరించి, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు రావాలి. లేకపోతే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పై పెరుగుతున్న అసంతృప్తి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. దీనిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి

**- నేడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం**



పాట్నా (ప్రశ్న న్యూస్) బీహార్ తదుపరి ముఖ్యమంత్రిగా బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంగళవారం నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీజేపీ శాసనసభా పక్షం సామ్రాట్ చౌదరిని తమ పార్టీ నేతగా ఎన్నుకుంది. దీనితో నేడు ప్రమాణం చేయనున్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ ఎన్నిక కోసం పరిశీలకుడిగా వచ్చారు. 1990లో ఆర్జేడీలో సామ్రాట్ చౌదరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1999లో వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత ఆయన జేడీయూలో చేరారు. అనంతరం ఆయన బీజేపీలో చేరగా, కొన్నాళ్లకే 2018లో బీహార్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2023 మార్చిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ఇప్పుడు బీహార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మొదటి బీజేపీ నేతగా ఆయన నిలవనున్నారు. ఆయన కుష్వాహా వర్గానికి చెందిన నాయకుడు. బీహార్‌లో యాదవుల తర్వాత కుష్వాహాల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. బీహార్‌లో ఇప్పటి వరకు ఈ వర్గానికి చెందిన నాయకుడికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం రాలేదు. సామ్రాట్ చౌదరిని పెద్ద నాయకుడిగా చేస్తానని బీహార్ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ క్రమంలో తొలుత ఉపముఖ్యమంత్రిగా చేశారు. రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**- 70 నియోజకవర్గాల్లో సమీకృత గురుకుల పాఠశాలలకు శ్రీకారం చుట్టాం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం, కల్లూరు మండలం చెన్నూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో 70 నియోజకవర్గాల్లో రూ. 200 కోట్లతో ఈ సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, నిర్ణీత సమయంలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.కల్లూరును ప్రత్యేక నియోజకవర్గంగా మార్చడం అనేది కేంద్ర ప్రభుత్వం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన సమీకరణలపై ఆధారపడి ఉంటుందని వివరించారు. సత్తుపల్లి ప్రాంతంలో మూడు పెద్ద ఆసుపత్రులు ఏర్పాటు చేయబోతున్నామని, పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఆర్థిక సవాళ్లు ఎదురైనా రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 బోనస్ వంటి పథకాలకు, విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్, అడిషనల్ కలెక్టర్ శ్రీజతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## శాంతినగర్ జలమండలి పరిధిలో కలుషిత తాగునీటి కష్టాలు

**- ప్రజల ఆరోగ్యానికి పొంచి ఉన్న ముప్పు**
**- సికింద్రాబాద్ నియోజకవర్గంలో జలమండలి నిర్లక్ష్యం**
**- శాంతినగర్ రహదారిపై దాదాపు 50 సంవత్సరాలుగా మార్చని డ్రైనేజీ పైపులైను**





తార్నాక (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలోని శాంతినగర్ జలమండలి పరిధిలో తాగునీరు తీవ్రంగా కలుషితమవుతున్న సమస్య గత కొన్ని నెలలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. నల్లా తిప్పగానే స్వచ్ఛమైన నీటి బదులు దుర్వాసనతో, మురికిగా కనిపిస్తున్న నీరు రావడం ప్రజల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. రోజువారీ అవసరాలకు కూడా ఈ నీటిని వాడటానికి ప్రజలు వెనుకాడుతున్నారు.

### పోల్యూషన్ నీటితో సతమతం స్థానికుల వేదన

స్థానికుల వివరాల ప్రకారం, మురుగునీరు పైప్‌లైన్లలోకి చొరబడటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోంది. చాలాసార్లు నీరు రంగు మారి, దుర్వాసనతో రావడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత దుస్థితి మెట్టుగూడ సర్కిల్ పరిధిలో జరుగుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు. అధికారుల నిర్లక్ష్యమే ఈ సమస్యకు కారణమని గత కొన్ని నెలలుగా ఈ సమస్య తీవ్రంగా ఉన్న అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.

### తాత్కాలిక చర్యలకే పరిమితమైన అధికారులు

జలమండలి సిబ్బంది అప్పుడప్పుడు లైన్లను "వాష్ అవుట్" చేసి నీటి సరఫరాను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, అది తాత్కాలిక ఉపశమనం మాత్రమే ఇస్తోంది. మూల కారణాలను గుర్తించి పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒకవేళ లైన్ మెన్ లు వాష్ అవుట్ చేయడం మరిచిపోయి మీరు సరఫరా చేస్తే పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటుందని ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందన్న భయం ప్రజలలో అడుగడుగునా వేధిస్తోంది.

### ఎప్పుడెప్పుడు వ్యాధులు వస్తాయోనన్న భయం

శాంతినగర్ జలమండలి పరిధిలో కలుషిత తాగునీటి కారణంగా టైఫాయిడ్, డెంగ్యూ, వైరల్ ఫీవర్స్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి రోజు నీరు తాగేటప్పుడు భయంతో తాగుతున్నాం అని ఒక మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. జలమండలి మేనేజర్ ఎండి లు స్పందించకపోవడం శాశ్వత పరిష్కారం చూపకపోవడం విడ్డూరంగా మారుతుంది.

### పాలకుల నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాలకు లెక్క లేదా.?

సికింద్రాబాద్ నియోజకవర్గంలో సమస్యపై పాలకులకు అసలు చిత్తశుద్ధి లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు అక్కడనే దర్శనమిస్తున్నాయి దానికి తోడు సంవత్సరాలుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు. ఇక శాంతినగర్ రహదారిపై దాదాపు 50 సంవత్సరాలు గడిచిపోయిన డ్రైనేజీ పైపులైను మార్చలేదని పెద్ద పైపులు లేకపోవడంతో నిత్యం డ్రైనేజీ రోడ్లమీద పొంగిపొర్లుతుందన్న ఆవేదన స్థానికులను ది వినిపిస్తోంది. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, పాలకులు, ఉన్నత అధికారులు పట్టించుకోకపోవడం ఆగ్రహానికి దారితీస్తోంది. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలను గుర్తు చేసుకునే నాయకులు, ఇప్పుడు వారి ప్రాథమిక అవసరాలైన తాగునీటిని కూడా సరిగా అందించలేకపోతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### శాశ్వత పరిష్కారం ఎప్పుడు.?

సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు కోరేది ఒక్కటే తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పాడైన పైప్‌లైన్ల మార్చి కొత్త పైపులైన్లు వెంటనే ఏర్పాటు చేసి పరిశుభ్రమైన తాగునీరు ఇచ్చే విధంగా చర్యలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. శాంతినగర్ జలమండలి పరిధిలో తాగునీటి సమస్య కేవలం ఒక కాలనీ సమస్య కాదు. ఇది ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న దుస్థితి ఇప్పటికైన ఉన్నత అధికారులు మేల్కొని సమగ్ర చర్యలు తీసుకోకపోతే, ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ప్రజల ప్రాణాల కంటే ప్రాధాన్యం ఇంకేదైనా ఉందా.? అనే ప్రజల ప్రశ్నకు పాలకులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైనది.

## కరవు ఏర్పడితే దానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

**- ప్రభుత్వంపై జీవన్ రెడ్డి ఫైర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో భవిష్యత్తులో కరవు పరిస్థితులు ఏర్పడితే దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి హెచ్చరించారు. జగిత్యాలలో బీఆర్ఎస్ నేత హరిచరణ్ రావు నివాసంలో జరిగిన భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రాణహిత జలాల వినియోగానికి తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుత సాగునీటి అవసరాలకు మేడిగడ్డ ప్రాజెక్టును తక్షణమే పునరుద్ధరించడం ఒక్కటే మార్గమని సూచించారు. ఇప్పటికే మూడు వ్యవసాయ సీజన్లు గడిచిపోయాయని, జాప్యం చేస్తే రైతులకు తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణానికి కేసీఆర్ స్ఫూర్తిప్రదాత అని, మేడిగడ్డలో చిన్న సాంకేతిక లోపాన్ని అడ్డం పెట్టుకుని ఆయనను దోషిగా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేడిగడ్డ పనులు పూర్తి చేయకపోతే రాబోయే కరవుకు కాంగ్రెస్ పార్టీయే జవాబుదారీ కావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588